
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జూలై 2024




- నాసిరకం విత్తనాలతో బొప్పాయి రైతు కుదేలు
- పలుచోట్ల నష్టపోయిన పంట
- సైజు పెరగని కాయలు
- ఆందోళనలో బొప్పాయి రైతులు

# నట్టేట మునిగారు..

జిల్లాలో నాసిరకం విత్తనాలు నాటిన బొప్పాయి రైతులు నిండా మునిగారు. మహారాష్ట్ర నుంచి తెప్పించిన నాసిరకం విత్తనాలు నాటిన రైతులు కాయలు సైజు పెరగక, కాయలకు మచ్చలతో నష్టాలను చవి చూస్తున్నారు. బొప్పాయి సాగు చేసే రైతులు సంప్రదాయ సర్టిఫైడ్ విత్తనాలు కాకుండా మహారాష్ట్ర నుంచి దిగుమతి అయ్యే జీ-15 రకం విత్తనాలు నాటి నష్టాలు చవిచూస్తున్నారు. వారం రోజుల క్రితం కలికిరి ప్రాంతంలో ఆ రకం విత్తనాలు నాటిన రైతులు పంట దిగుబడి సరిగ్గా లేక, కాయలకు మచ్చలు రావడం, అన్‌సైజు కాయలు కాయడంతో పాటు త్వరగా మెత్తపడటంతో తీవ్రంగా నష్టపోతున్నారు.



కలికిరి ప్రాంతంలో రైతులు సాగు చేసిన జీ-15 రకం బొప్పాయి పంట



కలికిరి ప్రాంతంలో అన్‌సైజులో కాసిన బొప్పాయి పంట

**మదనపల్లె టౌన్, జూలై 18 :** జిల్లాలో 10 వేల ఎకరాల వరకు రైతులు బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన తైవాన్ రెడ్ లేడీ-786 రకం విత్తనాలనే ఎక్కువగా విత్తుతున్నారు. జిల్లాలో రైతులు అధికంగా రైల్వేకోడూరులో 1850 ఎకరాలు, ఓబులవారిపల్లె మండలంలో 1500 ఎకరాలు, చిట్వేలి మండలంలో 1600 ఎకరాలు బొప్పాయి సాగు చేస్తుండగా పుల్లంపేట, రాజంపేట, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో కూడా రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. పదేళ్లగా రైతులు తైవాన్ రెడ్‌లేడీ-786 రకం విత్తనాలే విత్తి సాగు చేస్తున్నారు. జిల్లాలో పలు నర్సరీల యజమానులు కూడా ఈ రకం విత్తనాలు మొలకెత్తించి, నారును రైతులకు విక్రయిస్తున్నారు. ఈ రకం మొక్కలతో పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు ఎంత లేదన్నా (రెండేళ్ల కాలంలో) 30 నుంచి 60 టన్నుల బొప్పాయి దిగుబడి వస్తుంది. కాగా ఇటీవల కొందరు రైతులు మహారాష్ట్ర నుంచి తెప్పించిన జీ-15 రకం విత్తనాలతో ప్రయోగం మొదలు పెట్టారు. మూడేళ్లుగా జిల్లాలో పలుచోట్ల రైతులు జీ-15 రకం విత్తనాలు మొలకెత్తించి బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. తొలినాళ్లలో ఈ రకం విత్తనాలతో బొప్పాయి ఎకరాకు సరాసరిన 50 టన్నుల దిగుబడి వచ్చేది. దీంతో చాలా మంది రైతులు ఈ మొక్కలను కొనుగోలు చేసి పంట సాగు చేశారు. ఒక్కో మొక్క రూ.12 చొప్పున కొనుగోలు చేసి ఎకరాకు ఎంత లేదన్నా 900 నుంచి 1200 మొక్కలు నాటుతున్నారు. ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. తొలుత ఈ రకం బొప్పాయి పంట పర్వాలేదనిపించినా, తరువాత ఫెయిల్యూర్‌లు మొదలయ్యాయి. ఈ రకం పంట సాగులో పంట దిగుబడి తగ్గుతూ వస్తోంది. అంతేకాకుండా అన్‌సైజ్ కాయలు (చిన్నవి, పెద్దవి, మధ్యరకం) కాస్తున్నాయి. దీంతో పాటు పూత రాలిపోవడం ఎక్కువగా ఉండటం, బొప్పాయి కాయలు త్వరగా మెత్తబడుతుండటంతో రవాణా చేయలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు రోజుల క్రితం కలికిరి ప్రాంతంలో ఈ రకం బొప్పాయి సాగు చేసిన రైతులు లబోదిబోమంటూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

### మహారాష్ట్ర నుంచి అనధికారంగా దిగుమతి

జీ-15 రకం విత్తనాలను కొందరు విత్తన వ్యాపారులు అనధికారికంగా దిగుమతి చేసుకుని నర్సరీ యజమానులకు, రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కనీసం ప్యాకింగ్ కూడా లేకుండా లూస్‌గా ఈ రకం విత్తనాలు విక్రయిస్తున్నారు. వ్యవసాయశాఖ నుంచి ఎటువంటి సర్టిఫైడ్ కాని ఈ విత్తనం సాగు చేసిన రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 2 వేల ఎకరాలకు పైగా ఈ రకం బొప్పాయి విత్తనాల మొక్కలను రైతులు సాగు చేసినట్లు సమాచారం. మొక్కలు విత్తాక ఏడు నెలల తరువాత పంట చేతికొచ్చే దశలో దిగుబడి చూసి రైతులు నష్టపోయామని గ్రహిస్తున్నారు. దీంతో కొందరు చేసేదేమీ లేక మిన్నకుండిపోతుండగా, మరికొందరు బాధిత రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి సర్టిఫైడ్ పొందిన విత్తనాలు సాగు చేశాక అందులో నష్టపోతేనే రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుంది. కానీ రైతులే స్వయంగా వెళ్లి వారికి నచ్చినట్లు అనాథరైజ్డ్ విత్తనాలను సాగు చేసి నష్టపోతే నష్టపరిహారం రాదని అధికారులు చెబుతున్నారు. కొందరు నర్సరీల యజమానులు కూడా లాభాలు ఆశించి ఈ రకం విత్తనాలనే మొలకెత్తించి రైతుల కొంప కూలుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి బొప్పాయి రైతులు నష్టపోకుండా చూడాల్సి ఉంది.

### జీ-15 రకం సర్టిఫైడ్ కాదు..

జిల్లాలో పలువురు రైతులు జీ-15 రకం బొప్పాయి సాగు చేస్తున్నారు. ఈ రకం విత్తనాలు సర్టిఫైడ్ కాదు. ఈ రకం పంట సాగును ఉద్యానశాఖ ప్రోత్సహించదు. మహారాష్ట్ర నుంచి కొందరు రైతులు ఈ రకం విత్తనాలు తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు మహారాష్ట్ర నుంచి మొక్కలు తీసుకొస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని అన్ని నర్సరీలలో తనిఖీలు నిర్వహిస్తాం. అనుమతి లేని మొక్కలను పెంచుతూ రైతులకు విక్రయిస్తున్న నర్సరీ యజమానులపై విత్తన చట్ట ప్రకారం లైసెన్సులు రద్దు చేస్తాం.

**- రవిచంద్ర, జిల్లా ఉద్యానశాఖ అధికారి, రాయచోటి**

### విత్తన దుకాణాలను తనిఖీ చేస్తాం..

జిల్లాలో 15 రోజులుగా అన్ని విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీలు నిర్వహించాం. విజిలెన్స్ అధికారులతో కూడా తనిఖీలు నిర్వహించాము. ప్రభుత్వ అనుమతి ఉన్న రకం విత్తనాలనే విక్రయించాలని, అక్రమాలు జరగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాము. ఇప్పుడు జీ-15 రకం బొప్పాయి విత్తనాలు ఎవరైనా విక్రయించినట్లు మా విచారణలో తేలితే వారి దుకాణం లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

**- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, రాయచోటి**

## బొప్పాయి రైతులను ఆదుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట రైతులు, రైతు సంఘాల నాయకుల ధర్నా



రాయచోటి (కలెక్టరేట్), జూలై 18: బొప్పాయి నాసిరకం విత్తనాలతో ప్రజలను మోసం చేస్తున్న నర్సరీల యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద గురువారం కౌలు రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి, వాల్మీకిపురం, కలకడ, గుర్రంకొండ, పీలేరు మండలాలలో నకిలీ విత్తనాల కారణంగా పూర్తిగా నష్టపోయిన బొప్పాయి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు నాయకుడు వంగిమళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, పీలేరులలో 200 ఎకరాల్లో 100 మంది కౌలు రైతులు మదనపల్లి, కలికిరిలలోని నర్సరీల నుంచి బొప్పాయి మొక్క రూ.12 ఖర్చు పెట్టి కొనుగోలు చేశారన్నారు. ఒక్క ఎకరాకు 1000 మొక్కలు నాటారని అందుకు ఖర్చు దాదాపు రూ.2. లక్షలు వచ్చిందని వారు తెలిపారు. బొప్పాయి పంట వేసిన వారందరూ సన్న, చిన్న కారు రైతులేనని వారు తెలిపారు. ఎకరాకు 60 నుంచి 70 టన్నులు రావాల్సి ఉండగా నాసిరకం నారు వల్ల ఎకరాకు టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీకి తెచ్చి లక్షలాది రుపాయలు పెట్టుబడి పెట్టిన బొప్పాయి రైతులకు కన్నీరే మిగిలిందని వారు అన్నారు. ఇంత నష్టం జరిగినా ఉద్యాన, వ్యవసాయశాఖల వారు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని తెలిపారు. నాసిరకం నారు పంపిణీ చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుని నష్టపోయిన రైతులకు రూ.2 లక్షలు నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రైతు సంఘ నాయకులు కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సలీం బాష,రామక్రిష్ణ, వేణుగోపాల్, వెంకటరమణ, గంగురాజు, శ్రీనివాసులు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ఆర్జేడీపై విచారణ

- ఆధారాలు సమర్పించిన యూటీఎఫ్, విద్యార్థి సంఘాలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 18: పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం విచారణ జరిగింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీ ఏపీ డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. రాఘవరెడ్డి కడప డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పద అధికారిగా పేరుగాంచారు. అప్పటి అధికార పార్టీ వైసీపీ అండ తనకు ఉందంటూ ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వేధించడం, ప్రశ్నించిన వారిని అక్రమంగా సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు రాఘవరెడ్డి వైఖరిపై గళమెత్తారు. దీనిపై స్పందించిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అప్పటి కలెక్టర్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు సైతం రాఘవరెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అయితే రాఘవరెడ్డి అవినీతిపై అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా ఆయనకు ఆర్జేడీగా పదోన్నతి కల్పించింది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో రాఘవరెడ్డిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రసన్నకుమార్ విచారణ చేపట్టారు.

### ఆధారాలు సమర్పించిన యూటీఎఫ్

పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతిపై యూటీఎఫ్ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం యూటీఎఫ్ ప్రతినిధులు విచారణకు హాజరై విచారణ అధికారికి ఆధారాలను సమర్పించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేశ్‌బాబు మాట్లాడుతూ రాఘవరెడ్డి డీఈవోగా జిల్లాకు వచ్చిన నాటి నుంచి అవినీతి అక్రమాలే పరమావధిగా కొనసాగారన్నారు. ఉపాధ్యాయులను దూషించడం, ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడం షోకాజ్ నోటీసులు జారీచేయడం ఆయన నైజం అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఆందోళన చేపట్టడానికి వీలు లేదంటూ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత ఏడాది జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తనకు అర్హత లేకపోయినా యూజీసీ స్కేల్‌ను అక్రమంగా పొందాడన్నారు. అక్రమంగా పొందిన అదనపు వేతనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా పెడచెవిన పెట్టారని విమర్శించారు. డీఈవోగా ఆయనపై పలు ఆరోపణలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం ఆయనకు ఇక్కడే ఆర్జేడీగా పదోన్నతి కల్పించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేయడం మంచి పరిణామం అన్నారు. ఆయన చేసిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే.. రాఘవరెడ్డిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదరి గుజ్జల వలరాజు డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయంలో రాఘవరెడ్డిపై విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసాద్‌కు ఆధారాలు సమర్పించారు.

కాగా.. రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విచారణ చేసి రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని విచారణాధికారి తెలిపారు. ప్రధానంగా పదోన్నతులు, రివర్షన్లకు సంబంధించి రాఘవరెడ్డిపై ఆరోపణలు వచ్చాయన్నారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఆధారాలతో పాటు డీఈవో, ఆర్జేడీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తామన్నారు.

### ఉపాధ్యాయునిపై రాఘవరెడ్డి అనుచరుల దాడి

పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డికి సంబంధించి విచారణకు హాజరైన బయలాజికల్ సైన్సు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై రాఘవరెడ్డి అనుచరులు దాడి చేశారు. ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్ నేలకేసి కొట్టారు. ఉపాధ్యాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాఘవరెడ్డిపై ఫిర్యాదు చేస్తావా అని దుర్భాషలాడారు. దీంతో ఉపాధ్యాయుడు చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



రాఘవరెడ్డిని విచారిస్తున్న డాక్టర్ ప్రసన్న కుమార్

## చదువుల ఒత్తిళ్లా లేక..
# టీసీల కోసమా..!

- మాత్రలు మింగి ముగ్గురు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

కురబలకోట/మదనపల్లె టౌన్, జూలై 18: కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో కలకలం రేగింది. ఉన్నత స్థాయి చదువులు చదివి తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన చిన్నారులు అధ్యాపకుల ఒత్తిళ్లో లేక మరే కారణమో...ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కురబలకోట మండలం ముదివేడు క్రాస్ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా మదనపల్లె, సీటీఎం, ములకలచెరువుకు చెందిన ముగ్గురు విద్యార్థినులు 9వ తరగతి చదువుతూ హాస్టల్‌లోనే ఉంటున్నారు. కాగా ఇటీవల ఇంటి నుంచి వచ్చిన విద్యార్థిని తనతో పాటు పారసిటమాల్ మాత్రలను అధిక మొత్తంలో తెచ్చుకుంది. కాగా ఇటీవల పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని టీసీ తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. దీంతో తాము కూడా టీసీ తీసుకుని ఇంటికి వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతో మాత్రలు మింగినట్లు తెలిసింది. ఉదయం టిఫిన్ తిని విద్యార్థినులంతా క్లాస్‌లకు వెళ్లారు. అయితే వీరు మాత్రం క్లాస్‌కు వెళ్లకపోవడంతో అధ్యాపకులు వారి హాస్టల్ గదికి వెళ్లి చూడగా మాత్రలు తిని పడిపోయి ఉన్నారు. వెంటనే వారిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఒక విద్యార్థిని కేవలం ఒక మాత్ర మాత్రమే మింగడంతో ఆ విద్యార్థినిని వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు. ఈ విషయం తెలియడంతో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా మొదట్లో విద్యార్థినులు తమను అధ్యాపకులు వేధిస్తున్నారని చెప్పగా, మరి కొంతసేపటి తర్వాత తాము ఇంటికి వెళ్లిపోవాలని ఇలా చేసినట్లు పొంతనలేని సమాధానమిచ్చారు. ప్రభుత్వం స్పందించి ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో ఆర్డీవో హరినారాయణ, డీఈవో శివప్రకాష్‌రెడ్డి, డీవైఈవో పురుషోత్తం, ఎంఈవో ద్వారకనాథ్, జీసీడీవో రాధమ్మ తదితరులు, ఆసుపత్రి, పాఠశాలకు వెళ్లి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బందిని వేర్వేరుగా విచారించారు. కాగా ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలు బయటకు తెలియజేయాల్సి ఉంది. ఈ విషయమై డీఈవో శివప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో ఉండి చదువుకోవడం వారికి ఇష్టం లేదని, ఇంటి నుంచి వచ్చి చదుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేశారని తెలిపారు. ఇటీవల పాఠశాల నుంచి ఒక విద్యార్థిని టీసీ తీసుకుని వెళ్లడంతో వారు చర్చించుకుని ఇలా చేస్తే టీసీలు ఇస్తారని మాత్రలు మింగారని, దీనిపై పూర్తి స్థాయిలో అందరినీ విచారించామని తెలిపారు.

### విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే, ఆర్డీవో

కురబలకోట గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటనపై మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విడివిడిగా విచారించారు. గురువారం స్థానిక సర్వజన బోధనాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థినులు మాత్రలు మింగిన విషయమై విచారించాలని టీడీపీ అధిష్ఠానం తనను ఆదేశించిందని, ఈ క్రమంలో విద్యార్థినులు ఏ కారణంతో మాత్రలు మింగారో అడిగి తెలుసుకున్నానన్నారు. అంతేకాకుండా వీరు ముగ్గురికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించామన్నారు. ఆర్డీవో హరిప్రసాద్ కూడా ఆస్పత్రికి చేరుకుని జరిగిన సంఘటనపై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను విచారించారు. వైద్య చికిత్సలతో ముగ్గురు విద్యార్థులు కోలుకుంటున్నారని, దీనిపై నివేదికను సిద్ధం చేసి విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపాలని ఆర్డీవో ఆదేశించారు.





విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా.. ముదివేడు కస్తూర్బా పాఠశాల

## ఆస్తి పంచలేదని తండ్రిని చంపిన తనయుడు

- కారుతో ఢీకొట్టి హత్య
- మదనపల్లెలో అమానవీయ ఘటన

మదనపల్లె అర్బన్, జూలై 18: అల్లారుముద్దుగా పెంచుకున్న కన్న కొడుకే కన్నతండ్రి పాలిట కాలయముడిగా మారాడు. తన వాటాకు రావాల్సిన ఆస్తిని రాసివ్వలేదనే కోపంతో తండ్రిని కారుతో ఢీకొట్టి చంపిన అమానవీయ ఘటన మదనపల్లెలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..స్థానిక నీరుగట్టువారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్పరెడ్డి (65)కి ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నకుమారుడు నీరుగట్టి శంకర్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు నీరుగట్టి రఘునాథరెడ్డి కురబలకోట మండలం అంగళ్లులో కాపురం ఉంటున్నాడు. పెద్దకొడుకు స్థానికంగా ఉన్న ఓ కళాశాలలో పనిచేసి నిలిపేయగా, తర్వాత ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారం చేస్తూ నష్టాలకు గురైనట్లు తెలిసింది. ఇందులో భాగంగా రూ.16 లక్షలు మేర అప్పులు ఉన్నట్లు తల్లిదండ్రులకు చెప్పేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు నీరుగట్టి చిన్నరెడ్డెప్పరెడ్డి, తల్లి చంద్రకళ మధ్య కూడా అప్పుడప్పుడూ వివాదం జరిగేదని చెబుతున్నారు. తనకు అప్పులు న్నాయని, ఆస్తి రాసిస్తే అప్పులు తీర్చుకుంటానని పెద్దకుమారుడు రఘునాథరెడ్డి, తండ్రిని నిలదీసేవాడు. అందుకు ఆయన అంగీకరించకపోవడంతో భార్యాభర్తల మధ్య కూడా తరచూ వివాదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భార్య చంద్రకళ అటు భర్తను, ఇటు కుమారుడిని కాదనలేక బెంగళూరులో ఉంటున్న చిన్నకుమారుడు శంకర్‌రెడ్డి వద్దకు వెళ్లిపోయింది. ఈమె అయిదేళ్లుగా అక్కడే ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో తండ్రి చిన్నరెడ్డెప్పరెడ్డి మాత్రమే నీరుగట్టువారిపల్లెలో ఒంటరిగా ఉంటున్నాడు. ఇక్కడ నెలావారీ వచ్చే ఇంటి అద్దెలతో పాటు చిన్నపాటి వడ్డీ వ్యాపారం చేసుకుంటున్నాడు. వీరికి వారసత్వంగా వచ్చిన భూమి స్థానిక ప్రశాంత్‌నగర్‌లో ఉంది. ఆ భూమిపై కూడా అన్నదమ్ములైన చిన్నరెడ్డెప్పరెడ్డి, భాస్కర్‌రెడ్డిల మధ్య వివాదం ఉంది. ఈ నేపథ్యంలో కోర్టులో కేసు నడుస్తోంది. అయితే అంగళ్లులో ఉంటున్న పెద్దకుమారుడు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కొంతభూమిని రాసిస్తే తన ఇబ్బందులు తీరుతాయని తండ్రిని వెంటాడుతున్నాడు. కోర్టులో కేసు నడుస్తోందని, దానిని రాసివ్వడానికి వీలుకాదని తండ్రి చిన్నరెడ్డెప్పరెడ్డి నిరాకరించాడు. ఈ క్రమంలో తండ్రి, కుమారుడు మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. తండ్రి..యథావిధిగా నీరుగట్టువారిపల్లె నుంచి వాకింగ్ చేయడానికి బుధవారం సాయంత్రం బైపాస్ రోడ్డు ఏరియాకు వెళ్లాడు. దీనిని గమనించిన పెద్ద కుమారుడు అక్కడికే వెళ్లి ఆస్తి రాసివ్వాలని మరోసారి అడిగాడు. అది కోర్టులో ఉందని, ఇప్పటికిప్పుడు రాసివ్వడానికి వీలు కాదని తెగేసి చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి చివరికి వాగ్వాదానికి దారితీసింది. దీంతో కోపోద్రిక్తుడైన రఘునాథరెడ్డి తాను ఇక్కడికి వచ్చిన కారుతోనే ఢీకొట్టి తండ్రిని హత్య చేశాడు. అనంతరం నిందితుడు బెంగళూరులో ఉంటున్న తమ్ముడికి ఫోన్‌లో విషయం చెప్పి ఫోన్ స్విచాఫ్ చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని శంకర్‌రెడ్డి మదనపల్లెలో ఉంటున్న చిన్నాన్న భాస్కర్‌రెడ్డి, ఇతర బంధువులకు చెప్పాడు. దీంతో వారంతా మృతుడి కోసం రాత్రంతా గాలించినా ప్రయోజనం లేకపోయింది. తిరిగీ గురువారం తెల్లవారుజామున వెతకడంతో బైపాస్ రోడ్డు ఏరియాలోని నిర్మానుష్య ప్రాంతంలో మృతదేహాన్ని కనుగొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, టూటౌన్ సీఐ యువరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. తమ్ముడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు రఘునాథరెడ్డిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసును విచారిస్తున్నారు.



తండ్రిని చంపడానికి తనయుడు వాడిన కారు



హత్యకు గురైన నీరుగట్టి చిన్నరెడ్డెప్పరెడ్డి

## శివ కుటుంబాన్ని ఆదుకుంటాం : ఆర్డీవో

వాల్మీకిపురం, జూలై 18: కువైత్ బాధితుడు శివ కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి బీసీ కాలనీలో శివ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ కుటుంబానికి ఎలాంటి కష్టం రాకుండా ప్రభుత్వం ద్వారా ఆదుకునే దిశగా చూస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు, శివ పెద్ద కుమార్తె వెన్నెలను తిరిగి చదివించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే సీఎం సహాయ నిధి ద్వారా శివ కుటుంబాన్ని ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖతిజాన్‌కుప్రా, డీటీ ఫిరోజ్ ఖాన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శివ కుటుంబీకులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరిప్రసాద్

# 'ఉపాధి' నిధులు దుర్వినియోగం

- చెరువులు, కుంటల్లో పనులు
- కోట్ల రూపాయలు నిధులు దుర్వినియోగం
- పనులు చేసిన చోట.. మళ్లీ పనులు
- చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది

చక్రాయపేట, జూలై 18: పేద బడుగు బలహీన వర్గాల ఉపాధి కల్పన కోసం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ఈపథకం కేవలం చెరువులకే పరిమితమై పోయింది. ఉపాధి నిధులన్నీ పాపాఘ్ని పాలవుతున్నాయి. ఉపాధిహామీ పథకం 2006లో ప్రారంభించగా.. దాదాపు 18ఏళ్లు అవుతున్నా చెరువులు, కుంటలు, కొండలు, గుట్టల్లోనే గుంతలు తవ్వాల్సి వస్తోంది. వర్షాలు రాగానే చెరువులు నిండిపోయి అలుగు తీసి పాపాఘ్నిలోకి ప్రవహిస్తున్నాయి.

చక్రాయపేట మండలంలో దాదాపు 18 పెద్దచెరువులు, 16 కుంటలు, చెక్‌డ్యామ్‌లాంటివి ఉండగా వాటన్నింటిలో గుంతలు తవ్వాల్సి వచ్చింది. కారణం ఏదైనా పట్టా భూముల్లో స్థలాలు లేక కేవలం చెరువుల్లోనే తవ్వాల్సి వస్తోంది. 2015 వరకు ఈ పథకం అక్కడక్కడ పట్టా భూముల్లోని పొలాల్లో భూగర్భజలాల కోసం డకౌట్ పాండ్స్ తవ్వారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండ గా.. 2600 జాబ్‌కార్డులు ఉంటే.. కేవలం 1500 మంది కంటిన్యూగా చేసే కూలీలు ఉన్నారు. మండలానికి ఇప్పటి వరకు దాదాపు రూ.190 కోట్లు పైబడి నిధులు వచ్చాయి. దాదాపు ఈ నిధులన్నీ కూడా చెరువుల్లో గుంతలు తవ్వడానికి ఉపయోగించడంతో దుర్వినియోగం అయిపోయినట్లేనని స్థానికులు అంటున్నారు. చెరువుల్లో గుంతలు తవ్వడం వల్ల ఎటువంటి ఉపయోగం లేకుండా పోతోంది.


గంగారపువాండ్లపల్లె చెరువులో ఉపాధి పనుల కింద తవ్విన గుంతలు


దేశిరెడ్డి చెరువులో గత ఏడాది తవ్విన గుంతలు పూడిపోవడంతో మళ్లీ పనులు చేస్తున్న దృశ్యం

### చేసిన పనులే.. మళ్లీ మళ్లీ చేస్తున్న వైనం

మండలంలో గత ఏడాది పలు చెరువుల్లో ఉపాధి పనులు చేపట్టారు. చేసిన చోట మళ్లీ పనులు చేపట్టడంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. గంగారపువాండ్లపల్లె, దేశిరెడ్డి చెరువులో ఏడాది కింద తవ్విన గుంతలు పూడిపోవడంతో మళ్లీ పనులు చేపట్టారు. అలాగే తిమ్మారెడ్డిపల్లెలోని ఉప్పాలకుంటలో పక్కపక్కన గుంతలు తవ్వుతున్నారు. ఈపనులతో ఎటువంటి ఉపయోగం లేకపోగా.. నిధులు మాత్రం ఖర్చు అవుతున్నాయి. ఇక ఉపాధి పనుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనలకు హాజరయ్యే కూలీలు కంటే ఎక్కువ మందిని వచ్చినట్లు చూపుతూ కూలి డబ్బులు మింగేస్తున్నారని సమాచారం.


తిమ్మారెడ్డిపల్లెలోని ఉప్పాలకుంటలో పక్కపక్కన గుంతలు తవ్విన దృశ్యం

### వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తే..

ఉపాధి పనులను వ్యవసాయం పనులకు అనుసంధానం చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. రైతులకు కూలీలు ఖర్చు తగ్గి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు కూలీలకు రూ.500 ఇవ్వాల్సి వస్తోంది. అదే ఉపాధి కూలీలను రైతులకు అనుసంధానం చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. ఇక కొండలు, గుట్టల్లో తవ్విన గుంతల్లో పశువులు పడి మృతి చెందుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉపాధి పనులను రైతుకు అనుసంధానం చేయాలని కోరుతున్నారు.



### రైతుకు అనుసంధానం చేయాలి

రైతే రాజ్యం అంటారు కానీ రైతును పట్టించుకోరు. కూలీలకు అధి కంగా కూలీలు చెల్లించాలి. దీని వల్ల కూడా పెట్టుబడి పెరుగు తుంది. ఈ తరుణంలో ఉపాధి హామీ పథకం రైతుకు అనుసంధానం చేస్తే ఉపయోకరంగా ఉంటటుందని రైతులు వరినాట్లకు, మామిడి చెట్లు, చీనీచెట్లు తవ్వించుకోవడం, ఎరువులు వేయించుకోవడం తదితర వాటికి ఉపయోగించుకోవచ్చు. ప్రతి ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ఫలితం లేదు.

-వెంకటేశ్వర్లు, కల్లూరుపల్లె, చక్రాయ పేట మండలం.



### చేతులు బొబ్బలు వస్తున్నాయి...

ఉపాధి హామీ కింద పట్టా భూముల్లో గుంతలు ఎవరు తవ్వించు కోవడం లేదు. అసలే ఎండాకాలంలో పనులు చేయిస్తారు. మీటర్ లోతు తవ్వాల్సి ఉంటే అడుగు కూడా తవ్వలేకపోతున్నాం. చేతులు బొబ్బలు వస్తున్నాయి. మూడు నెలల నుంచి బిల్లులు రాలేదు. రైతుకు అనుసంధానం చేస్తే ఎంతో బాగుంటుంది.

-రమణ, ఉపాధి కూలి, నాగిరెడ్డిపల్లె, చక్రాయ పేట.

# గరుడ వాహనంపై సౌమ్యనాథుడు



నందలూరు, జూలై 18 : సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సౌమ్యనాథస్వామి మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారు గరుడ వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణగా వెళ్లి అనంతరం దిగువవీధి, పేటగడ్డ, బస్టాండ్ మీదుగా అరవపల్లె వరకు గ్రామోత్సవం కొనసాగింది. అరవపల్లెలో ముత్తుమారమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విడిదిలో ఉభయదారులను మంగళవాయిద్యాలతో ఆహ్వానించి పూజలు జరిపించారు. అనంతరం గ్రామోత్సవం అరవపల్లెలోని రైల్వేకాలనీ మరికొన్ని వీధుల్లో ఊరేగుతూ బ్రాహ్మణవీధికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అత్యం త ప్రత్యేకమైన గరుడసేవను తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం డోలోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం సౌమ్యనాథస్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కరుణించారు. కార్యక్రమంలో గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, చక్రాల రామసుబ్బన్న, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# జనసందోహం నడుమ గంధపు పీరు ఊరేగింపు


గంధపు పీరు ఊరేగింపు... కొబ్బరి దివిటీలను వెలిగిస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 18: మండల కేంద్రంలోని మఖాన్ వద్ద గత ఏడు రోజులుగా మత గురువులు, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనల నడుమ నిర్విరామంగా మొహ రం వేడుకలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి 12 గంటల నుంచి జనసందోహం నడుమ పురవీధుల్లో గంధపు పీరును గురువారం తెల్లవారుజామున 7 గంటల వరకు కొబ్బరిదివిటీల నడుమ ఊరేగించారు. గంధపు పీరు ఊరేగింపు సమయంలో మొక్కుబడులు ఉన్న వారు అత్తిరాసాలు, మిఠాయిలు పీరుపై వెదజల్లారు. ఈ ప్రసాదాల కోసం వచ్చిన భక్తులు గంధపు పీరు వెంబడి ఎగబడ్డారు. బుధవారం రాత్రి వివిధ రకాల డప్పు వాయిద్యాలు, బాణాసంచాల నడుమ గంధపు పీరు ఊరేగింపు సాగింది. కార్యక్రమానికి బెంగుళూరు, ముంబై, హైదరాబాద్, చెన్నై నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు, హిందువులు కలిసి సోదర భావంతో, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని సాగించారు.

# సీనియర్ క్రికెటర్ విజయ్‌కుమార్‌పై అసోసియేషన్‌లో ఫిర్యాదు


క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న గురు ప్రసాద్

కడప ఆంధ్రజ్యోతి, జూలై 18: మాజీ ఐపీఎల్, రంజీ ప్లేయర్ పైడికాల్వ విజయ్‌కుమార్‌పై వేంపల్లెకు చెందిన నేతి గురు ప్రసాద్ గురువారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రెడ్డి ప్రసాద్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విజయ్‌కుమార్ యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. తన కుమారుడైన గురుచరణ్‌ను క్రికెట్‌లో పైస్థాయికి తీసుకెళతానని.. అండర్ -19కి సంబంధించి రాష్ట్రస్థాయిలో మ్యాచ్‌లు ఆడిస్తానని.. కడప పట్టణంలోని డాన్‌బాస్కో గ్రౌండ్‌లో విజయ్ స్థాపించిన అకాడమీలో చేర్చుకున్నారు. అయితే అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి మ్యాచ్‌లో కూడా 11 మంది జట్టులో తన కుమారుడు ఉన్నప్పటికీ మ్యాచ్ ఆడించకుండా.. హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారుడిని మ్యాచ్ ఆడించడంలో విజయ్ కీలకపాత్ర పోషించడాని ఆరోపించారు. హైదరాబాద్ క్రీడాకారులు విజయ్‌కి డబ్బులు ఎక్కువ ముట్టజెప్పారని.. తాము తక్కువ డబ్బులు చెల్లించడం వల్లనే అన్యాయం చేశాడన్నారు. హైదరాబాద్‌కు సంబంధించిన వారిని తన అకాడమీలో చేర్చుకొని జిల్లా క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నాడని తెలిపారు. మాలాగే జిల్లాకు సంబంధించిన పలువురి వద్ద విజయ్‌కుమార్ డబ్బులు వసూలు చేశాడని.. అటువంటి వ్యక్తిని నేడు రాష్ట్ర సెలక్టర్‌గా ఎంపిక చేశారన్నారు. దీంతో జిల్లా క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే విజయ్‌కుమార్‌పై విచారణ జరిపి అసోషియేషన్ నుంచి అతన్ని తొలగించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రీడింగ్ రైటింగ్ స్కిల్స్ తప్పనిసరి : డీఈవో


మాట్లాడుతున్న డీఈఓ అనురాధ


కడప ఎడ్యుకేషన్, జూలై 18: ప్రతి విద్యార్థికి వారి తరగతికి సంబంధించి చదవడం, రాయడం లాంటి నైపుణ్యాలు కలిగి ఉండాలిన జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. గురవారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఎఎల్ఎస్ విశ్వనాథరెడ్డి, హెచ్ఎం నాగమణి ఆద్వర్యంలో ఎస్ఎఎల్‌టీ ప్రాజెక్టులో భాగంగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న వాటిని తరగతి గదిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తాగునీరు, మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు సాయిరామ్, ఏఎంఓ రామాంజినేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు చిన్నారి మృతి



సిద్దవటం, జూలై 18: మండలంలోని మాచుపల్లి గ్రామానికి చెందిన కందుల భానుశ్రీ(7) పాము కాటుకు మృతి చెందినట్లు చిన్నారి తల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఆమె వివరాల మేరకు... తన కుమార్తె భానుశ్రీ చెల్లితో కలిసి బుధవారం సాయంత్రం ఇంటి పక్కన ఆడుకుంటుండగా ఇటుక పెళ్లను కదిలించడంతో కింద ఉన్న పాము కాటు వేసిందన్నారు. అమ్మతో చెబితే కొడుతుందని.. చెప్పవద్దని చెల్లికి చెప్పి తల నొప్పి ఉందంటూ కింద పడిపోయిందన్నారు. ఈ విషయం తనకు వచ్చి చెప్పిందన్నారు. వెంటనే తన కుమార్తెను కడప ప్రైమ్ ఆసుపత్రికి తరలించామని.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. తన భర్త శ్రీనివాసులురెడ్డి జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉన్నాడని ఆమె తెలిపారు.

# రైలుకింద పడి యువకుడి మృతి


కిట్టు (ఫైల్ ఫొటో)

కమలాపురం రూరల్, జూలై 18 : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని తూర్పు గండ్లూరు కాలనీకి చెందిన రాజుపాళెం షాలెం (21) అలియాస్ కిట్టు అనే యువకుడు రైలుకింద పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు గురువారం సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

# రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందిలేకుండా చూడాలి

ఎర్రగుంట్ల, జూలై 18: రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందిలేకుండా సౌకర్యాలు కల్పించాలని గురువారం సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌ను కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు. ఎర్రగుంట్లలో కోచ్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయాలని, ప్లాట్‌ఫారాలను శుభ్రంగా ఉంచాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నవీన్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాశం, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రత నియమాలు విధిగా పాటించాలి

- నిర్లక్ష్యంతోనే అధిక శాతం ప్రమాదాలు
- ప్రజల సహకారంతోనే నివారణ
- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ


మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ

నాగరాజుపేట, జూలై 18: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని... అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగానే సంభవిస్తున్నాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ, విజిలెన్స్ విభాగపు సీఐ భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలను నివారించలేమని.. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించాలన్నారు. రైతులు పంట పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరం అని... పది సంవత్సరాల శిక్ష ఉంటుందని తెలిపారు. వాహన డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి ఎత్తైన లోడ్‌ను తీసుకెళ్లే సమయంలో పైన ఉన్న విద్యుత్ లైన్‌లను గమనించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలు ఈదురు గాలులు, వర్షాలకు తెగిపడిన విద్యుత్ వైర్లకు సంబంధించి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నా రు. దగ్గరలోని ఉపకేంద్రాల్లో ఉండే సిబ్బందికి తెలియజేసి వారి ద్వారా మరమ్మత్తులు చేయించుకోవాలని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలన్నారు. విద్యుత్ మోటార్ నుంచి స్టార్టర్ వరకు.. మెయిన్ స్విచ్ వరకు తీసుకెళ్లే వైర్లను భూమి లోపల కాకుండా సుమారు 15 అడుగుల ఎత్తులో కనపడే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొంత మంది ప్రజలు విద్యుత్ కొక్కీల వైర్ల ద్వారా విద్యుత్‌ను తీసుకోవాడం ద్వారా అవి తెగి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంటుందని.. వాటిని నివారించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి ఖచ్చితంగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇన్సులేషన్ రబ్బరు తొడుగు ఉన్న పనిముట్లను మాత్రమే వాడాలని.. అతుకులు గతుకులు ఉండే వైర్లను వాడరాదన్నారు. ఏవైనా మరమ్మత్తులు చేయాల్సి వస్తే విద్యుత్ అధికారులను సంప్రదించి చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్


డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 18 : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయుపట్టు అని, ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించా రు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్య లు తీసుకుంటుందన్నారు. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేస్తున్న వారికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణమూర్తి ఐపీవో, లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్ధన్, డిప్యూటీ కమీషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన (పీసీపీ ఎన్డీటీ) పై సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల లింగనిష్పత్తిని బాలురతో పోల్చితే.. బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. సమాజంలో ఆడపిల్లల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు కారకులైన వారికి చట్టపరమైన చర్యలు, శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో, ఆసుపత్రులలో లింగ నిర్ధారణ, భ్రూణహత్యలు చేయడం, ఆడపిల్ల వద్దంటూ కుటుంబంలో ఎవరైనా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆధారాలతో తెలియజేస్తే వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, పీసీసీ ఎన్డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, సభ్యులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, పోలీసు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

### గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి

గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణతో పాటు వైద్యులు ఐసీడీఎస్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించినపుడే ప్రసూతి సమయంలో మాతృమరణాలను అరికట్టగలమని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాస్థాయి ప్రసూతి మరణాల విచారణ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకొచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. మాతృమరణాల వివరాలను, కారణాలను అడిగి తెలుసుకున్నారు.

# ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 18: రాయచోటి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను ముస్లిం మైనార్టీలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలోని జామియా మసీదు కాంప్లెక్స్‌లో షాహీ జామియా మసిద్ కమిటీ, జమియత్ ఉలేమాయే హింద్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నేతలు మాట్లాడుతూ పట్టణంలోని దిబ్బల బిడికి సమీపంలో మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం 1.5 ఎకరాల జాగాను కేటాయించి అందులో భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.14 కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల చేయకుండా పేపర్లకే పరిమితం చేశారని చెప్పారు. దీంతో అక్కడ డిగ్రీ చదువుతున్న బాలికలు మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాసాపేటలో 2019 సంవత్సరంలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.39 కోట్లతో మైనార్టీ గురుకుల పాఠశాల నిర్మాణం కొరకు పనులు ప్రారంభించి పునాదులకే పరిమితం చేశారన్నారు. అలాగే రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె, మహబూబ్‌నగర్, రాజులకాలనీ, ఎస్టీ కాలనీ, ఆదిల్‌నగర్, రెడ్డీస్‌కాలనీల్లో నెలకొన్న సమస్యలను మంత్రికి వివరించారు. అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

# త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్

కడప (మారుతీనగర్), జూలై 18: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో త్వరలో నాణ్యమైన 4జీ సేవలను అందించనున్నట్లు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) అనంతపురం బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎస్.ముజీబ్ పాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా తమ సంస్థకు దాదాపు లక్ష టవర్లు ఉన్నాయన్నారు. ఆ మేరకు కడప జిల్లాలో 460 టవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని 4జీగా మార్పు చేయడంతో పాటు మరికొన్ని కొత్త టవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 4జీ శాచురేషన్ ప్రాజెక్టులో భాగంగా 143 ప్రదేశాలకు ప్రపోజల్ పంపించగా ఇప్పటికే 46 ప్రదేశాలకు అప్రూవల్ వచ్చిందన్నారు. ట్రయల్ ఆధారంగా జిల్లాలో ఇప్పటికే 20 టవర్లను ప్రారంభించి విజయవంతంగా 4జీ సేవలను అందిస్తున్నామన్నారు. ఇతర ప్రైవేట్ ఆపరేటర్లతో పోలిస్తే అతి తక్కువ ధరలకే బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందించనున్నామన్నారు. జిల్లాలో 2జీ, 3జీ సిమ్‌లు ఉన్నవారు త్వరలో ఉచితంగా 4జీ సిమ్ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏజీఎంలు బాలాజీ, లక్ష్మానాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## హంస, సింహ వాహనాలపై ఊరేగింపు



తాళ్లపాకలో పల్లకిలో ఊరేగుతున్న సిద్ధేశ్వర, చెన్నకేశవ స్వాములు

రాజంపేట, జూలై 18: తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి హంస వాహనంపై, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సింహ వాహనంపై తాళ్లపాక పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనవిందు చేశారు. గురువారం ఉదయం నుంచి సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్యాంకుమార్ బృందం ఊంజల్ సంగీతం, లక్ష్మీదేవి, గంగావతి బృందాల కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షణ అధికారి వై.హనుమంతయ్య, బాలాజీ, గురుస్వామి, వినోద్‌కుమార్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అధికారి గోపి, బాబు, ఆర్.స్వామినాయక్, గంగనపల్లి వెంకటరమణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ జాతర



పుత్తనవారిపల్లెలో పూజలు అందుకున్న గంగమ్మతల్లి

పుల్లంపేట, జూలై 18: మండల పరిధిలోని పుత్తనవారిపల్లెలో గురువారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. గంగమ్మతల్లిని తయారు చేసి బుధవారం రాత్రి వేపాకుల మండపానికి తీసుకువచ్చి తెల్లవారుజాము నుంచి పూజలు చేశారు. మహిళలు పొంగుబాళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామమంతా బంధువులు, మిత్రులతో విందు భోజనాలు చేసి సంబరాలు చేసుకున్నారు. సాయంత్రం గంగమ్మతల్లికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయుడు, పి.కృష్ణమ్మనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, ఈశ్వర్‌నాయుడు, మణి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

ఓబులవారిపల్లె, జూలై 18: కళాశాల విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళుతుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనిని ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు, గ్రౌండ్ లెవలింగ్ కొరకు రూ.2 లక్షలు, స్టేజ్ కొరకు నల్లబండలు, రేకులు ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షలు మొత్తం రూ.19 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ, ఫిజికల్ డైరెక్టర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి శారద, ప్రిన్సిపల్ హరిత, ప్రసాద్, రమణరాజు, జూనియర్ కళాశాల సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

సిద్దవటం, జూలై 18: మండలం కణంలోపల్లి సమీపంలో గురువారం జేఎంజే కాలేజీకి పక్కన కనుమలోపల్లె రెవెన్యూ గ్రామం వద్ద కొత్త పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన కోసం కడప జాయింట్ కలెక్టర్, ఆర్డీవో రావడం జరిగిందని సిద్దవటం తహశిల్దారు కొత్త పెట్రోల్ బంకు పెట్టుటకు స్థలం తనిఖీ చేశారు. ఇందుకు తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వో, గ్రామ సర్వేయర్లు హాజరై స్థలాన్ని చూపించడం జరిగింది.

## వేగవంతంగా సభ్యత్వాల నమోదు

రైల్వేకోడూరు, జూలై 18: వేగవంతంగా జనసేన క్రియాశీలక సభ్యత్వాలు చేస్తున్నామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రలు తెలిపారు. గురువారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద జనసేన సభ్యత్వాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశానుసారం సభ్యత్వాలు ప్రారంభించామని, ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహిస్తామన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించి పవన్‌కళ్యాణ్‌కు నివేదిక ఇస్తామన్నారు. జనసేన పార్టీ నాయకులు, క్యాకర్తలు అందరూ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్ ఇన్‌ఛార్జులు జోగినేని మణి, పగడాల వెంకటేష్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, నాయకులు పగడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం, జూలై 18: మండల సర్వసభ సమావేశాన్ని నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని మండల పరిషత్ సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరు కావాలని వీరితో పాటు మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.



# కుక్కలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

- పిల్లలు ఒంటరిగా వెళితే అంతే సంగతులు
- తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త



వీధుల్లో గుంపులుగా నిలబడి ఉన్న వీధి కుక్కలు

రాజంపేటటౌన్, జూలై 18: రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఏ వీధిలో వెళ్లినా విపరీతంగా కుక్కల సంతతి పెరిగింది. పట్టణవాసులు ఒంటరిగా బయటకు రావాలంటే భయపడే పరిస్థితిలో ఉన్నారు. పట్టణంలో ఇప్పటివరకు పలుమార్లు కుక్కలు పలువురిపై దాడిచేసి గాయపరిచిన దాఖలాలు ఎన్నో ఉన్నా వాటి సంతతిని తగ్గించే చర్యలు తీసుకోవడంలో ఏమాత్రం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రాత్రివేళ, పాఠశాలల నుంచి, ట్యూషన్ల నుంచి ఒంటరిగా పిల్లలు ఇంటికి వెళ్లేటప్పుడు వెంటబడి గాయపరుస్తున్నాయి. పిల్లలు భయపడే పరిస్థితి పట్టణంలో నెలకొంది. మున్సిపాలిటీ అధికారులు వాటిని తగ్గించేందుకు పలు టీకాలను వేసి వాటి సంతతి నివారణకు చర్యలు చేపడతారు. కానీ రాజంపేట మున్సిపాలిటీ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో వారంలో ఎక్కడో చోట కుక్కకాటు సంభవించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఒకసారి ఒక చిన్న బాబుపై విచక్షణ రహితంగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఆ చిన్నారి చావు బతుకుల నడుమ పోరాడి బతికాడు. ఈ సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పట్టణంలో కుక్కల సంతతి వృద్ధి కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. గతంలో మున్సిపాలిటీ అధికారులు కుక్కలను పట్టి వాటిని ఓ ఏజెన్సీ ద్వారా దూరంగా పంపుతారు. కానీ నెలల లోపే ఆ కుక్కలన్నీ తిరిగి తమ గ్రామాల్లోకి వచ్చి చేరుతున్నాయి. అధికారులు కుక్కల సంతతి వృద్ధి కాకుండా నివారణ చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## కలివికోడి ఆచూకి కోసం సర్వే కొనసాగిస్తాం



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సిద్దవటం, జూలై 18: కలివికోడి ఆచూకి కోసం సర్వే కొనసాగిస్తామని సిద్దవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి, సీనియర్ శాస్త్రవేత్త జగన్నాధం తెలిపారు. సిద్దవటం అటవ ప్రాంతాల్లో కలివికోడి ఆనవాళ్ల కోసం సర్వే చేపడుతున్నామన్నారు. కలివికోడిపై అటవీశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, ఆచూకి కోసం అటవీశాఖతో పాటు మైసూర్‌కు చెందిన ఎన్జీవో సంస్థతో కలిసి 100 సీసీ కెమెరాలతో సర్వే కొనసాగిస్తామని తెలిపారు. కెమెరాలు అమర్చేటప్పుడు అరుదైన ప్రాంతాన్ని ఎన్నుకోవాలని, దానివల్ల అటవీ ప్రాంతంలో ఉన్న పక్షులు కనపడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజి అధికారి ఓబులేశు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టండి

లక్కిరెడ్డిపల్లె, జూలై 18: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీసీహెచ్‌ఎస్ డెవిడ్ సుకుమార్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్లు సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. అన్నిరకాల వ్యాధులకు సంబంధించి పరికరాలు అందుబాటులో ఉన్నాయని, సాధ్యమైనంత వరకు వేరే ఆసుపత్రికి రెఫర్ చేయవద్దన్నారు. రోగుల గదులు, ఓపీ పాయింట్, ఎక్సరే, ఈసీజీ, ల్యాబ్, ఆరోగ్యశ్రీ గదులను పరిశీలించారు. అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణీలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరపాలని, వైద్యులు రాత్రి వేళలో అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలన్నారు. గుండెనొప్పి ఉందని ఎవరైనా ఆసుపత్రికి వస్తే వారిని రెఫర్ చేయకుండా వైద్యం చేయాలని, ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్‌బేగం, వైద్యులు జీవన్, భరత్, సులోచన, నిస్సార్‌అహ్మద్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ కాలుష్యాన్ని నివారించండి

- మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటిటౌన్, జూలై 18: ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు పట్టణ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన జిల్లా కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని వినాయక విగ్రహ తయారీ కేంద్రాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యానికి హాని కలిగించే పీవోపీ, కెమికల్స్‌తో విగ్రహాలు తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణంలోని రాజధాని కల్యాణ మండపం, కడప రోడ్డు, గాలివీడు రోడ్డుల్లో వినాయకుడి విగ్రహాలను తయారు చేస్తున్న గోడౌన్‌లను పరిశీలించి తయారీదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ పర్యావరణానికి నష్టం కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్టితో చేసిన విగ్రహాలు మాత్రమే తయారు చేసి విక్రయించాలని సూచనలు చేశారు. రాయచోటి వినాయక ఉత్సవ కమిటీ ద్వారా దాదాపు 2 వేల మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది మహేశ్వర్‌రెడ్డి, రెడ్డిభాస్కర్, జగదీశ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల తయారీదారులతో మాట్లాడుతున్న కమిషనర్

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రికి వినతిపత్రం

రామాపురం, జూలై 18: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామికి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. గురుకులంలో ఇటీవల రిటైర్మెంట్ అయ్యి ఖాళీ అయిన పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుల సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ మెర్సీ కుమారి, ఐటీ వింగ్ నాయకులు క్రాంతి కుమార్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## కోదండరాముని దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

ఒంటిమిట్ట, జూలై 18: ఏకశిలా నగరి కోదండరాముని ఐఏఎస్ అధికారి వాణిమోహన్ కుటుంబ సభ్యులతో గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్ అయిన సీతారాముల లక్ష్మణులను దర్శించుకున్నారు. రంగ మండపంలో ఆలయ విశిష్టతను, చరిత్రను తెలుసుకుని తీర్థ ప్రసాదాలు అందేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు శ్రావణ్‌కుమార్, సిబ్బంది ప్రవీణ్, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## వన్‌స్టాప్ సెంటర్ వరం

చిట్వేలి, జూలై 18: బాధిత మహిళలకు వన్‌స్టాప్ సెంటర్లు వరం లాంటిదని లీగల్ అడ్వైజర్ చంద్రకళ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్, వెలుగు సంస్థ ఆధ్వర్యంలో 100 రోజుల మిషన్‌శక్తి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రకళ మాట్లాడుతూ అక్టోబరు 4 వరకు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మిషన్‌శక్తి పేరుతో మహిళల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సురేఖరాణి, వసుంధరమ్మ, సీసీలు సురేందర్, ఈశ్వరయ్య, సుబ్రమణ్యం, రాజమోహన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలి

రాజంపేట, జూలై 18: కుష్టువ్యాధిపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సానే శేఖర్, కుష్టువ్యాధి వైద్య నిపుణురాలు డాక్టర్ ఎం.సౌజన్య, డాక్టర్లు వికాస్, లక్ష్మీపసన్నలు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కొత్తబస్టాండ్, మార్కెట్, పాతబస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారం ఏర్పాటు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రమాదాలను నివారించండి

రాయచోటిటౌన్, జూలై 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ అమరావతి సూచనల మేరకు ఉమ్మడి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి ఆదేశాల మేరకు గురువారం రాయచోటి మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు పగడాల శ్రీనివాసులు, ఎంవీ రమణ, ఎం.నాగేశ్వరరావు, సీవీ రమణమూర్తి, కల్యాణ్, విశ్వనాధ్, పవన్‌కుమార్‌స్వామి, రాయచోటి అర్బన్ ఎస్ఐ కృష్ణ, పోలీసు సిబ్బంది, వీరభద్ర జూనియర్ కళాశాల స్టూడెంట్స్ తదితరులు రాయచోటి కోర్టు నుంచి ఆర్టీసీ బస్టాండు, బంగ్లా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోతే వారి వాహనానికి ఉన్న ఇన్సూరెన్స్ రద్దు చేస్తామని, దాని వలన కుటుంబానికి ఎటువంటి ఆర్థిక లబ్ధిపొందే వీలు లేదన్నారు.

**సిద్దవటం:** మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం మండల లీగల్ కమిటీ సర్వీస్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడపాలని విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సీనియర్ న్యాయవాది రామదాసు, కోర్టు సిబ్బంది, స్థానిక పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈవో విలియంరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నందలూరు:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని మండలంలోని న్యాయవాదులు పేర్కొన్నారు. అనంతరం బస్టాండ్ కూడలిలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం, న్యాయవాదులు దాసరి, నరసింహులు, మహ్మద్ అలీ, ఆనంద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**రాజంపేటటౌన్:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల భారిన పడవద్దని సీనియర్ సివిల్ జడ్జి కేశవ పేర్కొన్నారు. గురువారం రాజంపేట పట్టణంలోని కోర్టు ఆవరణం నుంచి న్యాయవాదులు, పోలీసులు కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ మద్దెయ్య ఆచారి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వర్మ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు:** ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని రైల్వేకోడూరు ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులో హైకోర్టు ఆదేశానుసారంగా మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో వన్-కే-వాక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలన్నారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లె ఎస్ఐ చిన్నపెద్దయ్య, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూలై 18: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారుడు ఫస్ట్ డాన్ బ్లాక్‌బెల్ట్ సాధించిన సందర్భంగా గురువారం జగన్‌మోహన్‌రాజు తన కార్యాలయంలో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్, ఐడెంటి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మరక్షణ విద్యలో అత్యున్నతస్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మండల ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, మాజీ మండలాధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, సిద్దవటం మాజీ జడ్పీటీసీ చలమయ్యయాదవ్, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఉపాధ్యక్షుడు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, మాస్టర్లు పి.చంద్రశేఖర్, కె.గంగారాం, సి.చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, జూలై 18: ఇంటింటి కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేను పారదర్శకంగా నిర్వహించి సమాజంలో ఉన్న కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వాల్మీకి వీధిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎల్‌సీడీసీ (కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే) కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేది వరకు ఆశా కార్యకర్తలతో పాటు ఎంపిక చేసి శిక్షణ పొందిన మగ కార్యకర్తల ద్వారా ఇంటింటి కుష్టువ్యాధి సర్వే నిర్వహిస్తారన్నారు. అలాగే స్పర్శ, నొప్పిలేని మచ్చలు శరీరంలో ఏ భాగంలోనైనా ఉండవచ్చని, ఇటువంటి మచ్చలపై నిర్ధారణ చేసుకోవాలన్నారు. జిల్లాను కుష్టురహిత జిల్లాగా తయారు చేసేందుకు ప్రజలు ఇంటింటి కుష్టువ్యాధి గ్రస్తుల సర్వేకు సహకరించాలని డాక్టర్ కొండయ్య కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ, డీఎస్ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఎంవో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీలు రక్తహీనతకు గురికావద్దు



గర్భిణీలకు పౌష్టకాహారాన్ని అందిస్తున్న పీడీ శశికళ

లక్కిరెడ్డిపల్లె, జూలై 18: గర్భిణీలు రక్తహీనతకు గురికావద్దని, తద్వారా పుట్టబోయే బిడ్డలో సామర్థ్యాలు, తెలివితేటలు తగ్గుతాయని జిల్లా శిశుసంక్షేమశాఖ పీడీ శశికళ పేర్కొన్నారు. అస్పిరేషనల్ బ్లాక్‌లో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వారు గర్భం ధరిస్తే 80 శాతం బిడ్డ చనిపోయే పరిస్థితి ఉంటుందని, తల్లికి కూడా ప్రాణాపాయం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆహార అలవాట్లు మార్చుకోవాలని, రాగిజావ, రాగిముద్ద, రాగిమాల్ట్, అటుకులు, పాసయం, రాగిరొట్టె తీసుకుంటే మంచి పోషక విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సీడీపీఓ పద్మావతి, నీతిఆయోగ్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్లు దాదాబీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వసతిగృహ పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ సిద్దయ్య

లక్కిరెడ్డిపల్లె, జూలై 18: వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోనంపేట డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రతి రోజు భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అన్నం వండే పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకు కిటికీలకు మెస్ ఏర్పాటు చేసి దోమలు నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వార్డన్ పెద్దక్క, వైద్యసిబ్బంది కుమారి, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శాశ్వత భవనాలు నిర్మించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

రాయచోటిటౌన్, జూలై 18: ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల సౌకర్యార్థం శాశ్వత భవనాలు నిర్మించాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి 30వ తేది వరకు వసతి గృహాల సందర్శనకు పిలుపునిచ్చినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శివారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావుతో పాటు విద్యార్థులతో కలిసి వసతి గృహాల సందర్శనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా చాలా వరకు ప్రభుత్వ హాస్టల్స్ మూతపడ్డాయని, వీటిని వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. వసతి గృహ విద్యార్థులకు శాశ్వత భవనాలు, కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాలు పడినప్పుడు గోడలు తడిసి ముట్టుకుంటే కరెంటు షాక్ తగిలే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ చార్జీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సుబ్బు, కోశాధికారి వినయ్, నాయకులు లోకేశ్, కుమార్‌నాయక్, వాసుదేవనాయక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాపునాడు అధ్యక్షుడిగా రామసుబ్బయ్య



రామసుబ్బయ్య, సుబ్బరాయుడు

రైల్వేకోడూరు, జూలై 18: కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా ముద్దపోలు రామసుబ్బయ్య, కార్యదర్శిగా గుగ్గిళ్ల సుబ్బరాయుడులు నియమితులయ్యారు. ఈ మేరకు కాపునాడు రాష్ట్ర కార్యదర్శి కటికం సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపులను చైతన్యవంతులను చేస్తామని, కాపుల అభివృద్ధికి పాటుపడతామని, నియోజకవర్గ కేంద్రంలో వంగవీటి రంగ విగ్రహాన్ని కాపునాడు, కాపులందరి సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు.

## శ్రీహరికోటను సందర్శించిన విద్యార్థులు



శ్రీహరికోటను సందర్శించిన తాళ్లపాక విద్యార్థులు

రాజంపేట, జూలై 18: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌ను రాజంపేట మండలంలోని తాళ్లపాక గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. విజ్ఞాన విహార యాత్రలో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాల తాళ్లపాక విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని సందర్శించి భూమి నుంచి నింగికి వెళుతున్న రాకెట్ల ప్రయోగశాలలోని భాగాలను క్షుణ్ణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వనజాక్షి, సైన్స్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్ వివరంగా తెలియజేశారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా ఇలాంటి విజ్ఞాన విహారయాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

రాజంపేటటౌన్, జూలై 18: మండల పరిధిలోని పోలి ఎస్టీ కాలనీలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రి పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ పోతుగుంట మాట్లాడుతూ విద్యార్థులు దాతలు ఇచ్చిన సహకారాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని వారు తెలిపారు. పోలి ఎస్టీ కాలనీలో గత 20 ఏళ్లుగా విద్యా సామగ్రి పంపిణీ చేస్తూ విద్యార్థుల ఉన్నతికి సహకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పిడికిటి సంతోష్, కోశాధికారి నరసింహ, లయన్స్‌క్లబ్ సభ్యుడు షేక్ అబ్దుల్లా, పెనిగలపాటి చంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటిటౌన్, జూలై 18: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీపీటీడీ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం వారు రాయచోటి డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, జిల్లా కార్యదర్శి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు సోమశేకర్, కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

# తిరుపతి ఆర్డీవోను విచారించిన సీఐడీ

**రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలంటే వారం వ్యవధి కోరిన ఆర్డీవో నిశాంత్‌రెడ్డి**

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని సీఐడీ అధికారులు గురువారం విచారించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు పలు అంశాలపై సమాచారం కోరారు. కోరిన సమాచారాన్ని రెండు రోజుల్లో ఇవ్వాలని సూచించారు.గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామకిషోర్, ఎస్‌ఐ మంజుల సిబ్బందితో కలసి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలసి పలు అంశాలపై విచారించారు. ఈ సందర్భంగా తమకందిన ఫిర్యాదులో పేర్కొన్న మేరకు చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, తొలగింపులకు సంబంధించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు వంటివాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆర్డీవో చెప్పినట్టు తెలిసింది. అలాంటప్పుడు చంద్రగిరి గత ఎమ్మెల్యే ప్రైవేటు కార్యాలయానికి తరచూ ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని, అక్కడికి నియోజకవర్గంలోని తహసీల్దార్లను ఎందుకు పిలిపించాల్సి వచ్చిందని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఆర్డీవో తాను ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లడంలో తప్పేంవుందని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. ప్రభుత్వ పనులపై తాను ఎమ్మెల్యేను కలవడం, ఆయన కార్యాలయానికి వెళ్లడం తప్పెలా అవుతుందని, తహసీల్దార్లను పిలిపించడం కూడా తప్పేమీ కాదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఓటర్ల జాబితాకు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, తన ప్రమేయం ఏమీ లేదని చెప్పినట్టు తెలిసింది. సుమారు గంట పాటు సీఐడీ అధికారులు ఆర్డీవో ఛాంబర్‌లో గడిపి అవసరమైన సమాచారం సేకరించే ప్రయత్నం చేసి అనంతరం వెనుదిరిగారు.

# వెటర్నరీ వర్సిటీలో నిధుల దుర్వినియోగం

- వైసీపీ పాలనలో లాయర్ల ఫీజుకింద రూ.96లక్షల ఖర్చు
- స్టాండింగ్ కౌన్సిల్ ఉన్నా.. అదనపు న్యాయవాదుల నియామకం
- లీగల్ ఖర్చులపై ఎల్‌ఎఫ్ ఆడిట్ అధికారుల అభ్యంతరం



వెటర్నరీవర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి రూరల్, జూలై 18 : తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో లీగల్ ఖర్చుల కింద గత వైసీపీ పాలనలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న విమర్శలు రేగాయి. వర్సిటీ ఉద్యోగుల పదోన్నతులు, బకాయిలు, నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నియామకాలు తదితర కేసులకోసం ప్రభుత్వ ధనాన్ని న్యాయవాదుల ఫీజు కింద దాదాపు రూ.96లక్షలు ఖర్చు చేసినట్లు సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో బయటపడింది.హైకోర్టులో వర్సిటీకి సంబంధించి కేసులు వాదించేందుకు 2020-2024సంవత్సరాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.రామమోహనరావును నియమించింది. ఈయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.20వేలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.దీని ప్రకారం ఈయనకు నాలుగేళ్లకు దాదాపు రూ.10లక్షలు గౌరవవేతనం ఇవ్వాల్సివుండగా.. ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించిన ఇతర న్యాయవాదులతో కలిపి రూ.96లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే అదనంగా పొన్నవోలు సుధాకర రెడ్డి(ఏఏజీ), వైవీ రవిప్రసాద్, పీవీ సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలను న్యాయవాదులుగా నియమించి వర్సిటీ అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారు. దీనికితోడు అప్పట్లో ఏఏజీగా ఉన్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి కూడా ఫీజు చెల్లించారని, నిబంధనల ప్రకారం ఆయనకు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కేసులకు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. లోకల్ న్యాయస్థానంలో కూడా ప్రభుత్వం నియమించిన స్టాండింగ్ కౌన్సెల్ వర్సిటీకి సంబంధించిన కేసులను ఎంగేజ్ చేయాల్సి ఉందని,అయితే ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇంటర్నల్‌గా వర్సిటీ ఉన్నతాధికారుల అనుమతితో మధుకర్‌రెడ్డి అనే న్యాయవాదిని నియమించి ఫీజు కింద రూ.6,85,200 చెల్లించారు. రెండునెలల కితం వర్సిటీలో నిర్వహించిన లోకల్‌ఫండ్(ఎల్‌ఎఫ్) ఆడిట్ అధికారులు ఈ ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. కోర్టును ఆశ్రయించిన ఉద్యోగులతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునే చిన్నచిన్న సమస్యలకు కూడా న్యాయవాదులకు అనవసరంగా ఫీజుకింద డబ్బు చెల్లించారని చెబుతున్నారు.ఈ నాలుగేళ్లలో హైకోర్టులో దాదాపు 60కేసులు, సుప్రీంకోర్టులో 10కేసులు దాఖలు చేయడాన్ని బట్టి ఉద్యోగుల పట్ల వర్సిటీ పాలకులు అనుసరించిన వైఖరి ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది.అలాగే 2016-17లో ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్ (రాయలసీమ, కోస్టల్ ఆంధ్రా జోన్) ప్రకారం గతంలోనూ అధికారులు చాకచక్యంగా నిధులను దుర్వినియోగం చేశారని.. కాంట్రాక్ట్ ఏజెన్సీలకు బ్యాంకు చెక్కులను సీరియల్‌గా ఇవ్వాల్సిఉండగా మధ్యమధ్యలో తమకు అనుకూలంగా మలచుకుని చెక్కులు అందించారని, మంత్లీ అకౌంట్స్‌లో నగదు లెక్కలు కూడా తారుమారు చేసినట్లు ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్‌లో నివేదించారని అంటున్నారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది ఇంతవరకు తేలలేదంటున్నారు. అప్పట్లో పోస్టల్ స్టాంప్స్‌లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కంపెనీలకు కూడా డబుల్ పేమెంట్ చేశారని కూడా ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై అప్పటి ఫైనాన్స్ అధికారులపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని ఆడిట్ రిపోర్ట్‌లో స్పష్టంగా నివేదించినా ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగుల ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. అలాగే 2020-21లో కూడా ఓ అధికారి(రాయలసీమ జోన్) కాంట్రాక్ట్ ఏజెన్సీలకు డబుల్ పేమెంట్ చేశారని, ఈ విషయం వెలుగులోకి వచ్చాక రెండు సంవత్సరాల తర్వాత ఏజెన్సీల నుంచి రికవరీ చేసినట్లు సమాచారం. ఈ అవకతవకలకు కారణమైన వారికి కనీసం మెమో ఇచ్చిన దాఖలాలు కూడా లేకపోవడమేమిటని ఉద్యోగులు నిలదీస్తున్నారు. కాగా వర్సిటీ ప్రధానకేంద్రంగా గతవారంరోజుల నుంచి అకౌంటెంట్ జనరల్ ఆడిట్(ఏజీ) జరుగుతోందని, వీటిపై లోతైన విచారణ చేపడితే నిజాలు వెలుగుచూసే అవకాశం ఉందని ఉద్యోగవర్గాలంటున్నాయి.

## గుప్త నిధుల ముఠా అరెస్టు


గుప్త నిధుల తవ్వకాల్లో పట్టుబడిన ముద్దాయిలు, పనిముట్లు, కారు

తవణంపల్లె, జూలై 18: గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని గాజులపల్లె సమీపంలోని పూర్ణచంద్రారెడ్డి మామిడి తోటలో గుప్త నిధుల కోసం బుధవారం రాత్రి నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన బిట్రగుంట దానయ్య(53), కంచరాల శ్రీనివాసులు(55), శశికుమార్(52), శ్రీకాళహస్తి చెంచులక్ష్మి కాలనీకి చెందిన వేలు(44), రమేష్‌చంద్రన్(44), వెంకటరమణయ్య(65) తవ్వకాలు చేపట్టారు. నిధులు దొరక్కపోవడంతో వెనుతిరిగి వెళుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. అరగొండ నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారులో తవ్వకానికి ఉపయోగించిన పనిముట్లు గుర్తించి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురి అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ పథకం వేసిన శ్రీకాళహస్తి నాగులగుంటకు చెందిన రఘును అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.

## 25న కాణిపాకం హుండీ లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జూలై 18: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానుకలను ఈనెల 25న ఆస్థాన మండపంలో లెక్కించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఆ రోజున ఆలయ సిబ్బంది ఎవరూ సెలవు పెట్టరాదని పేర్కొన్నారు.

## జనావాసాల్లోకి నెమలి


ఎర్రంవాండ్లపల్లిలో ఇళ్లపై తిరుగుతున్న నెమలి

కల్లూరు, జూలై 18: పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీ ఎర్రంవాండ్లపల్లి గ్రామంలో గురువారం జాతీయ పక్షి నెమలి సంచరించింది. ఇళ్లపై తిరుగుతున్న నెమలిని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. గ్రామానికి సమీపంలోని చలపతి గుట్టలో ఉన్న నెమలి గుంపు నుంచి ఈ నెమలి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా కుప్పం: కలెక్టరు


కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో వినతులను పరిశీలిస్తున్న కలెక్టరు

కుప్పం, జూలై 18: కుప్పం నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన 'ప్రజావినతుల స్వీకరణ- పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకే కుప్పంలో ప్రజా వినతుల స్వీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల నుంచి ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై వినతులు వస్తున్నట్లు చెప్పారు. సామాజిక పింఛన్లు, గృహనిర్మాణం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపైనా కొందరు అర్జీలిచ్చారన్నారు. ఈ వినతులను 15 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం, ప్రగతిని తనతో పాటు జేసీ కూడా సమీక్షిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. తాను 15 రోజులకు ఒకసారి కుప్పంలో పర్యటిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యలను ఆరు నెలల్లోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జేసీ శ్రీనివాసులు, కడా పీడీ వికాస్ మర్మత్, డ్వామా పీడీ రాజశేఖర్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు తులసి, పద్మనాభం, టీడీపీ నియోజకవర్గ నేతలు మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి నిరాకరించాడని.. యువతి ఆత్మహత్య

**మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నిరసన**


విద్య (ఫైల్ ఫొటో) - అగరంపల్లె ఆర్చి వద్ద శవంతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఐరాల(కాణిపాకం), జూలై 18: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఐరాల మండలం చిగరపల్లెలో గురువారం చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. చిగరపల్లెకు చెందిన జగన్నాథం, చిట్టి దంపతుల పెద్ద కుమార్తె విద్య(22), జీడీ.నెల్లూరు వెంకటాపురానికి చెందిన దుర్గాప్రసాద్ ప్రేమించుకున్నారు. డిగ్రీ పూర్తయిన తర్వాత పెళ్లి చేసుకుందామని నిశ్చయించుకున్నారు. చిత్తూరులోని ప్రభుత్వ కళాశాలలో గత ఏడాది డిగ్రీ పూర్తి చేశారు. పెళ్లి చేసుకుందామని విద్యా దుర్గాప్రసాద్‌ను కోరిన ప్రతిసారీ వాయిదా వేస్తూ వచ్చాడు. గురువారం మరోసారి కోరడంతో పెళ్లికి నిరాకరించాడు. మనస్తాపానికి గురైన విద్య చిగరపల్లెలోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అగరంపల్లె ఆర్చి వద్ద ఉంచి, నిరసనకు దిగారు. దుర్గాప్రసాద్‌ను శిక్షించాలని కోరారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అక్కడికి చేరుకుని బాధితులతో చర్చించారు. న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతించారు. కాణిపాకం ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## 23 నుంచి కుప్పంలో భువనేశ్వరి పర్యటన

కుప్పం, జూలై 18: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 23, 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని టీడీపీ వర్గాల తెలిపాయి. ఎన్నికలకు ముందు బూత్ ఇన్‌చార్జీలతో సమావేశమైన ఆమె అత్యధిక మెజారిటీలు వచ్చిన బూత్‌లను ఎన్టీయార్ ట్రస్టు తరపున దత్తత తీసుకుంటానని హామీనిచ్చారు. అలాగే ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా ఆయా బూత్‌ల పరిధిలోని అన్ని కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ఆసరా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆమె నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యధిక మెజారిటీ వచ్చిన బూత్‌లలో పర్యటించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు తెలిపాయి.

## రాజీనామా చేసిపో..

- అక్రమాలపై నిర్లక్ష్య సమాధానం చెప్పారని తహసీల్దారుపై ఎమ్మెల్యే ఆగ్రహం

పెనుమూరు, జూలై 18: 'మీకు ఇష్టం లేకపోతే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోండి. ఏం మాట్లాడుతున్నారు' అంటూ తహసీల్దారుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెనుమూరు హైస్కూల్‌లో కిట్ల పంపిణీకి ఎమ్మెల్యే థామస్ హాజరయ్యారు. మండలంలో జరిగిన అక్రమాలపై తహసీల్దారును ఆరా తీశారు. ఆయన అడిగిన వాటికి బదులు ఇవ్వకపోగా పొంతనలేని సమాధానంతో ఎదురుతిరిగి మాట్లాడటంతో ఎమ్మెల్యేతో పాటు అక్కడ ఉన్న నాయకులు సైతం ఆగ్రహించారు. పెనుమూరులోని సర్వే నంబరు 430లో అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగితే ఏమీ చేయలేదని సమాధానం చెప్పారు. గొల్లపల్లిలో ఓ రైతు పొలంలో వెళుతున్న కాలువపై అడిగినందుకు రైతు చెప్పినట్లు చేయలేమని తహసీల్దారు అన్నారు. దీంతో రాజీనామా చేసి వెళ్లిపో అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఎన్‌టీఏ దరఖాస్తు గడువు పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), జూలై 18: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ 2024 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు ఇప్పటికే ముగిసిన దరఖాస్తు స్వీకరణ గడువును ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 10 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వోగా గౌతమి

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వోగా గౌతమిని నియమించారు. గతంలో సీవీఎస్వోగా ఉన్న నరసింహకిషోర్ బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ పోస్టుకు ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. ఈ క్రమంలో టీటీడీ ఎడ్యుకేషన్, హెల్త్ జేఈవోగా ఉన్న గౌతమికి ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఆ స్థానంలో మరో ఐపీఎస్ అధికారిని నియమించే వరకు గౌతమి ఇన్‌చార్జ్ సీవీఎస్వో బాధ్యతలను చూడనున్నారు.

# సర్పంచి బావపై హత్యాయత్నం

**జగనన్న కాలనీ ఇళ్ల స్థల వివాదమే కారణం ● పాతగుంటలో ఉద్రిక్తత**




ధ్వంసమైన మునేంద్ర ఆస్తులు - హత్యాయత్నానికి పాల్పడిన మునేంద్ర - గాయపడిన బొజ్జారెడ్డి

వెదురుకుప్పం, జూలై 18: జగనన్న కాలనీ ఇళ్ల స్థల విషయమై ఏర్పడిన వివాదం హత్యాయత్నం వరకు దారి తీసింది. పాతగుంట సర్పంచి భువనేశ్వరి బావ బొజ్జారెడ్డి(60)పై (వైసీపీ), అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు మునేంద్ర(30) గురువారం సాయంత్రం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామానికి సమీపంలో జగనన్న కాలనీకి స్థలం కేటాయించారు. పాతగుంటకు చెందిన సీహెచ్ మునీంద్ర జగనన్న కాలనీకి కేటాయించిన ప్రాంతంలో మూడు ఇళ్ల స్థలం కన్నా ఎక్కువ స్థలంలో ఇల్లు, షెడ్డు వేసుకున్నాడు. ఆ స్థలం తాను ఇతరుల వద్ద గతంలోనే కొనుగోలు చేశానని చెబుతున్నాడు. అయితే రెవెన్యూ అధికారులు ఇతని షెడ్డు ఉన్న స్థలాన్ని ఇతరులకు కేటాయించారు. ఈ వివాదం కొన్ని రోజులుగా జరిగి చివరకు సర్పంచ్ భువనేశ్వరి బావ బొజ్జారెడ్డి వద్దకు పంచాయితీ వెళ్లింది. రెండు ఇళ్ల స్థలం వదిలి మిగతా స్థలంలోనే షెడ్డు ఉండాలని మునేంద్రకు చెప్పారు. తాను కొనుగోలు చేసిన స్థలం కాబట్టి ఇవ్వడానికి ఆయన నిరాకరించాడు. బొజ్జారెడ్డి పలుమార్లు మునేంద్రపై ఒత్తిడి తేవడంతో పగ పెంచుకున్నాడు. గురువారం పాతగుంటలో మద్దేరి మునస్వామిరెడ్డి మృతి చెందగా అంత్యక్రియలకు బొజ్జారెడ్డి హాజరయ్యారు. అంతిమ యాత్రలో పాల్గొన్నాడు. శవాన్ని దించి కార్యక్రమాలు నిర్వహిస్తుండగా కొంత దూరంలో బొజ్జారెడ్డి సేదదీరుతుండగా మునేంద్ర తన వెంట తెచ్చుకున్న కంకీ కొడవలి (కత్తిలాంటిది)తో మెడపై, చేతి వేళ్లపై నరికాడు. ఆయన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మునేంద్రను పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత మునేంద్ర ఏమయ్యాడో తెలియడం లేదని పాతగుంట ప్రజలు తెలిపారు. గాయపడిన బొజ్జారెడ్డిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. సర్పంచ్ బంధువులు మునేంద్రకు చెందిన ఇళ్లపై దాడులు చేశారు. ఆస్తులు, ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనతో పాతగుంట గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న కార్వేటినగరం సీఐ సత్యబాబు, వెదురుకుప్పం పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

### రెవెన్యూ నిర్లక్ష్యమే కారణం

జగనన్న కాలనీ ఇళ్లకు స్థలాలు కేటాయించే సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం లేకుండా స్థలాలు కేటాయించి ఉంటే ఈ వివాదానికి అవకాశం ఉండేది కాదని అంటున్నారు. ఆదిలోనే ఏదో ఒకటి తేల్చి ఉన్నా సమస్య ఇంత వరకు వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రేమోన్మాదం

- గంజాయికి బానిసైన యువకుడి ఘాతుకం
- మూడేళ్లుగా బాలిక వెంటబడి వేధింపులు
- అవ్వ మందలింపులతో కక్ష పెంచుకున్న వైనం
- వృద్ధురాలి గొంతుకోసి....మనవరాళ్లపై ఇనుప రాడ్‌తో దాడి చేసి పరార్


మృతురాలు జయలక్ష్మి

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 : గంజాయి మత్తుకు బానిసైన ఓ జులాయి విచక్షణ కోల్పోయాడు.మూడేళ్లుగా వెంటబడి తిరిగినా తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఆ యువతి కుటుంబంపై పగబట్టాడు. గురువారం చీకటిబడ్డాక ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించి వారింట్లో దూరాడు. ప్రేమ విషయంలో మందలించిందన్న కోపంతో ఆ యువతి నాయనమ్మ గొంతుకోసి చంపేశాడు.తరువాత ఆమె చెల్లెలి తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం మెట్లమీద ఎదురుపడిన ఆ యువతిపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.పోలీసుల కథనం మేరకు... తిరుపతి రాయల్‌నగర్‌లో కాపురమున్న శ్రీనివాసులు బసవయ్య అండ్ కో పేరుతో శానిటరీ మార్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నాడు.రోజూ శ్రీనివాసులు తన భార్య రక్షతో కలసి దుకాణానికి వెళ్లేవాడు. శ్రీనివాసులు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె ప్రేరణ(18) ఢిల్లీలో బీబీఏ చదువుతోంది. చిన్న కుమార్తె నియతి(14) ఇక్కడే 9వ తరగతి చదువుకుంటోంది.శ్రీనివాసులు ఇంటి ముందు కాపురమున్న తాపీ మేస్త్రీ నరసింహులు రెండవ కుమారుడు శ్రీనివాస్ తరచూ ప్రేరణను ప్రేమ పేరుతో వెంటబడి వేధించేవాడు.ఈ విషయమై ఆమె నాయనమ్మ జయలక్ష్మి (67) పలు సందర్భాల్లో అతడిని మందలించిందని సమాచారం.సెలవులు కావడంతో ఇటీవల ప్రేరణ తిరుపతికి వచ్చింది. దీంతో శ్రీనివాసులు ఆమెను తరచూ మానసికంగా వేధించడం ఎక్కువైంది.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ప్రేరణ తన తల్లి రక్షతో కలిసి డ్రైవింగ్ నేర్చుకోవడం కోసం బయటకు వెళ్లారు.చీకటి బడ్డాక శ్రీనివాస్ తలపై టోపీ, ముఖానికి మాస్కు ధరించి ఎదురింట్లో దూరాడు. సెకండ్ ఫ్లోర్‌లో వున్న జయలక్ష్మి దగ్గరకు వెళ్లి కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు.ఆపై ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చి అక్కడున్న నియతిని తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు.దీంతో ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగుతుండగా బయట్నుంచి వస్తున్న ప్రేరణ మెట్లమీద ఎదురుపడడంతో ఆమెపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఆమె తల్లి వద్ద స్కూటీ తాళాలు లాక్కున్న శ్రీనివాస్ కింద ఇంటి ముంగిట పార్కు చేసి వున్న బాధితుల స్కూటీలోనే పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన నియతి పరిస్థితి విషమంగా వుండడంతో ఆమెను ఎలైట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడ్డ ప్రేరణను కూడా ఆస్పత్రిలో చేర్చారు.ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందగానే ఎస్పీ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.డీఎస్పీ రవిమనోహరాచారి,సీఐలు మురళీమోహనరావు, జయనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు కూడా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డాయి.డాగ్ స్క్వాడ్ బాధితుల ఇంటి ముందు కాపురమున్న నరసింహులు ఇంటి వద్దకు వెళ్ళి ఆగిపోయింది. దీంతో పోలీసులు బాధితులను విచారించగా అసలు విషయం బయటపడింది.జయలక్ష్మి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ రాయల్‌నగర్‌కు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేరణతో మాట్లాడి పరామర్శించారు.నిందితుడు శ్రీనివాస్‌ను పట్టుకోవడం కోసం ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.


స్కూటర్‌పై పరారవుతున్న శ్రీనివాస్

# గుర్రంకొండ సంతంటే దడ..!

● మాయమవుతున్న ఖరీదైన ఫోన్లు ● వందదాకా ఫోన్లు చోరీ ● హడలిపోతున్న ప్రజలు, వ్యాపారులు



గుర్రంకొండలో శుక్రవారం జరిగే సంత (ఫైల్)

గుర్రంకొండ, జూలై 18: గుర్రంకొండ సంతలో కూరగాయలు, నిత్యావసరాలు, పండ్లు కొనుగోలు చేయడానికి వెళ్లిన ప్రజలకు పెద్ద కష్టం వచ్చిపడుతోంది. సంతలో వందలాది రూపాయల కూరగాయలు కొంటే వేలాది రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుంటున్నారు. ప్రతి శుక్రవారం సంతలో ఐదు నుంచి 10 సెల్‌ఫోన్‌లను కేటుగాళ్లు చాకచక్యంగా కొట్టేస్తున్నారు. సంతలో చోరీలు జరగకుండా ప్రతి వారం పోలీసులు గస్తీ ఉన్నా చోరీలు మాత్రం ఆగడం లేదు. సెల్‌ఫోన్లు చోరీ చేసే దొంగలను ప్రజలు పట్టించినా వదిలేస్తున్నారని బహిరంగంగా చర్చించుకొంటున్నారు. దీంతో ప్రజలు, వ్యాపారులు, మహిళలు సంతలో అడుగుపెట్టాలంటే హడలిపోతున్నారు. గుర్రంకొండ పట్టణంలో ప్రతి శుక్రవారం సంత జరుగుతుంది. ఈ సంతకు పెద్దమండెం, గాలివీడు, కలకడ, తరిగొండ, వాల్మీకిపురం, చిన్నమండెం, ముదివేడు, అంగళ్లు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులను తీసుకొస్తారు. దీంతో సంత ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 6.30 గంటల వరకు జరుగుతుంది. ఈ క్రమంలో కేటుగాళ్లు సంతలో తిరుగుతూ విలువైన సెల్‌ఫోన్లు కలిగిన వ్యక్తులను గమనించి జనాలు రద్దీగా ఉండే సమయంలో సెల్‌ఫోన్లను కొట్టేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల సమయంలో అధిక సంఖ్యలో కేటుగాళ్లు సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంతలో చోరీలు జరగకుండా గస్తీగా పనిచేసే సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్ప మిగిలిన సమయంలో సంత ప్రాంతంలో తిరగడం లేదని ప్రజలు, వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. జిల్లా అధికారులు సెల్‌ఫోన్‌ల చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**ఆరు నెలల్లో వందకుపైగా...**

గుర్రంకొండ పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే సంతలో సుమారు వందకుపైగా సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. ఈ ఆరు నెలల కాలంలో నెలకు 20 చొప్పున సెల్‌ఫోన్లు పోయాయి. సంతలో చోరీకి గురైన సెల్‌ఫోన్ల విలువ రూ.20 లక్షల నుంచి 30 లక్షల వరకు ఉంటాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంతలో సెల్‌ఫోన్ దొంగలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నా పట్టించుకొనే వారు లేకపోవడం ప్రజలను ఆందోళనకు చెందుతున్నారు.

**మైనర్ నిందితుడు ఎక్కడ...?**

గుర్రంకొండ సంతలో సెల్‌ఫోన్లను చోరీ చేసే మైనర్ నిందితుడిని రెండు వారాల క్రితం స్థానికులు పోలీసులకు పట్టించారు. నిందితుడు మైనర్ కావడంతో ఒకరోజు పోలీస్ స్టేషన్‌లో ఉంచుకుని పంపేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు మైనర్‌ల నుంచి వివరాలను సేకరించారా లేదా అన్న సమాచారాన్ని పోలీసులను అడిగారు. దీంతో మైనర్‌ను మదనపల్లెలోని ఓ ప్రైవేట్ బాలల కేంద్రంలో అనధికారంగా ఉంచినట్లు తెలుస్తోంది. బాల నిందితుడు అక్కడే ఉన్నాడా లేదా...? అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

**సెల్‌ఫోన్ దొంగలపై నిఘా ఉంచాం**

గుర్రంకొండ సంతలో సెల్‌ఫోన్‌లను చోరీ చేసే ముఠా సభ్యులపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇందుకోసం ప్రతి శుక్రవారం సంత రోజు ఇద్దరు పోలీసులను ఉంచి చోరీలు జరగకుండా నియంత్రిస్తున్నాం. స్థానికులు పట్టించిన మైనర్‌ను మరోమారు విచారించి చోరీలను అరికడతాం.

- నాగార్జున్‌రెడ్డి, ఎస్‌ఐ, గుర్రంకొండ

# అధికారుల సహకారం అవసరం

● పీలేరు మండల మీట్‌లో ప్రజాప్రతినిధులు వెల్లడి



ఉపాధి సిబ్బందిపై ఫిర్యాదు చేస్తున్న ఎర్రగుంటపల్లె ఎంపీటీసీ అమరనాథరెడ్డి

పీలేరు, జూలై 18: సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని అలాలేకపోవడం వల్లే ఇబ్బందులు కలుగుతున్నాయని మండల సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. అధికారుల సహకారం లేకపోవడం వల్ల తమ ప్రాంతాల్లో అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి అధ్యక్షతన గురువారం పీలేరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలంవారిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు నాగమ్మ, దొడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బులమ్మ మాట్లాడుతూ తమ గ్రామాల్లోని దళితవాడల్లో ఇప్పటికీ కరెంటు స్తంభాలు లేక వీధి లైట్లు ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. ఎర్రగుంటపల్లె ఎంపీటీసీ సభ్యుడు అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు బిల్లులు సరిగ్గా చెల్లించడం లేదన్నారు. మేళ్లచెరువు ఎంపీసీటీ సభ్యుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిపివేశారని, పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బస్సు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, అలా చేయని అధికారులపై ఇకపై చర్యలు తీసుకుంటామంటూ ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా గ్రామాల్లో లెప్రసీ, అతిసార, జ్వరాలకు సంబంధించిన ఇంటింటి సర్వే జరుగుతోందని, ఆ జబ్బులతో ఎవరైనా బాధపడుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తేవాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు షామియాన షఫీ, వైస్ ఎంపీపీలు ఎస్వీ చలపతి, హరిత, ఎంఈవోలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతమ్మ, ఎఫ్ఎస్‌వో సబిహా సుల్తానా, ఎఫ్‌బీవో చంద్రకళ, పశువైద్యాధికారి రామచంద్రారెడ్డి, ఏపీవో మహేశ్వర, ఏపీఎం లక్ష్మణ్ రెడ్డి, ఆర్టీసీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో భారీ ఇసుక డంప్ సీజ్



ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, జూలై 18: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును అధికారులు సీజ్ చేశారు. గురువారం మధ్యాహ్నం తహసీల్దారు బ్రహ్మయ్య, ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, మైనింగ్ శాఖ సర్వేయర్ దుర్గాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ జేబీవీ దేవి, వీఆర్వో రమణలు ఆర్టీసీ బస్టాండ్ పక్కన అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపును పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ..సీజ్ చేసిన ఇసుక దాదాపు 550.80 క్యూబిక్ మీటర్ల వరకు ఉంటుందని, దీని విలువ దాదాపు రూ.3.5 లక్షల వరకు ఉంటుందన్నారు. సదరు ఇసుకను స్థానిక ఓ వైసీపీ నాయకుడు గ్రామంలో కాలువల నిర్మాణం చేపట్టడానికి డంప్ చేసినట్లు తెలిపాడని.. అయితే, ఇసుకకు సంబంధించి ఎటువంటి వే బిల్లులు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఇంకా ఎక్కడైనా అక్రమంగా ఇసుక డంప్‌లు ఉంటే గుర్తించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సీజ్ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది , వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## తుమ్మనంగుట్ట వద్ద ఇసుకడంప్ స్వాధీనం

బి.కొత్తకోట, జూలై18: బి.కొత్తకోట మండలంలోని తుమ్మనంగుట్ట వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకడంప్‌ను గురువారం మండల అధికారులు సీజ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ హయాంలో అక్రమంగా నిల్వ చేసి ఉన్న ఇసుక డంప్‌లను అధికారులు ఒక్కొక్కటిగా సీజ్‌చేసి స్వాధీనం చేసుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే తుమ్మనంగుట్ట వద్దనున్న 27 క్యూబిక్‌మీటర్ల డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్ఐ బాలాజి, వీఆర్‌వో సంధ్య రెవిన్యూసిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి

కురబలకోట, జూలై 18: అనారోగ్యంతో ఆర్మీ జవాన్ మృతి చెందిన సంఘటన జరిగింది. మండలంలోని కురబలకోట పంచాయతీ పగడాలవారిపల్లెకు చెందిన రాజన్న కుమారుడు వెంకటేష్(30) ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా 12 ఏళ్ల క్రితం విధులలో చేరగా, ఆయన సికింద్రాబాద్, పంజాబ్‌లలో పని చేసి ప్రస్తుతం రాజస్థాన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆయన రెండు నెలలు క్రితం గ్రామానికి వచ్చి భార్యను విడిచి పెట్టి వెళ్లాడు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కాగా గత నెల 27న కిడ్నీ వ్యాధి కారణంగా అస్వస్థతకు గురి కావడంతో జోధ్‌పూర్ మిలిటరీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులకు ఆర్మీ ఉద్యోగులు తెలియజేశారు.

## మహిళకు వరకట్న వేధింపులు నలుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 18: ఓ మహిళను అదనపు కట్నం తీసుకురావాలంటూ చిత్రహింసలకు గురిచేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి యర్రాతివారిపల్లికు చెందిన డి.ఉషారాణికి చంద్రగిరి మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శివకుమార్‌తో 2022లో వివాహం జరిగింది. అయితే అప్పటి నుంచి భర్త శివకుమార్ తనకు ఆరోగ్యం సక్రమంగా లేదని భార్య ఉషారాణిను పక్కన పెడుతూ వస్తున్నాడు. దీనికి తోడు ఉషారాణి అత్త కస్తూరి, మామ సుబ్బరా మయ్య, మరిది విజయ్‌కుమార్‌లు అదనపు కట్నం కావాలని వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త శివ కుమార్, అత్త కస్తూరి, మామ సుబ్బరామయ్య, మరిది విజ యకుమార్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు.



## శివకి సాయం

వాల్మీకిపురం, జూలై 18: వాల్మీకిపురం మం డలం చింతపర్తి బీసీ కాలనీకి చేరుకున్న అయివేట శివ కుటుంబానికి మదనపల్లెకు చెందిన ఎన్నారై లోకేష్ కొణిదెల గురువారం రూ.20 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహిత శేషాద్రి రెడ్డి, నవీన్, మహేష్, నాని ఉన్నారు.

## విగ్రహాల తనిఖీ

ములకలచెరువు, జూలై 18: ములకలచెరువులో జరుగుతున్న వినాయక విగ్రహాల తయారీని గురువారం తహసీల్దార్ అనీల్ కుమార్ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మే రకు భారీ విగ్రహాలను పరిశీలించా రు. అ నంతరం కదిరి నా ధుని కోట కౌలు రైతులతో చర్చించారు.



## ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

● ది సిటిజన్ కో- ఆపరేటివ్ సొసైటీ ఎండీ కేవీ సుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ది సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకు ఎండీ కేవీ సుబ్బయ్య

మదనపల్లె అర్బన్, జూలై18: ఖాతాదారులకు ది సిటిజన్ కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని సొసైటీ ఎండీ కేవీ సుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక సీటీఎం రోడ్డులోని ది సిటిజన్ కో- ఆపరేటింవ్ సొసైటీలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లో 42 బ్యాంక్ బ్రాంచీలు ఉన్నాయని రూ. 4 వేల కోట్లు పైగా వ్యాపారలావాదేవీలు జరుగుతున్నాయన్నారు. అన్ని ఖాతాదారులు కలిపి 96 వేలమంది ఉన్నారని మదనపల్లెలో బ్రాంచ్ 2016లో ప్రారంభించి అధిక లాభాలు సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా మదనపల్లె బ్రాంచ్‌లో గోల్డ్‌లోన్స్ ఐదు నిమిషాల్లో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గృహ రుణాలు, ఇంటిపై మార్టిగేజ్ రుణాలు, సకాలంలో అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బ్యాంకు సభ్యుల పిల్లలకు పదో తరగతి, ఇంటర్‌లో 95 శాతం మార్కులు సాధించిన వారికి పది వేలు చొప్పన పారితోషికం అందించారు. కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మన్ పీఆర్‌ఎన్ రాజు, ఆర్ఎం లోకనాథనాయుడు, బ్రాంచ్ మేనేజరు చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు అప్పగింత

కురబలకోట, జూలై 18: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను టీడీపీ నేత శివకుమార్ పోలీసులకు అప్పగించారు. మండలం లోని నందిరెడ్డిగారిపల్లెకు వ్యక్తులు చాలా రోజులుగా ఇటుకల బట్టీలకు ట్రాక్టర్‌లతో చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలి స్తున్నారు. దీంతో ఆ ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీసులకు అప్ప గించగా ముదివేడు పోలీసులు కేసు నమోదు చేశారు.

## నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి

ములకలచెరువు, జూలై 18: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించాలని పీలేరు వ్యవశాయ శాఖ ఏడీఏ రమణరావు ఆదేశించారు. ములకలచెరువులోని ఎరువులు, పురుగుల మందు దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తే ఖచ్చితంగా బిల్లులు ఇవ్వాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో లీలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## 21న ఉచిత కంటి వైద్యశిబిరం

మదనపల్లె టౌన్, జూలై 18: స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఈనెల 21న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 7330868914 సంప్రదించాలన్నారు.

## రేపు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

మదనపల్లె అర్బన్, జూలై 18: మదనపల్లె ఆర్టీసీ వన్ అండ్ టూ డిపోల్లో ఈ నెల 20న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వన్ డిపో డీఎం వెంకరమణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సుల వలన కలిగే సమస్యలపై, ప్రయాణికులకు కలిగే ఇబ్బందులపై, ఈ నెల 20న 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఫోన్‌చేయవచ్చన్నారు. ఫోన్ నెంబరు 9959225676కు సంప్రదించాలని డీఎం కోరారు.

## నాయకులు, కార్యకర్తల కృషే నా గెలుపు

● ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజావేదిక
● మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జూలై 18: మదనపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి వల్లనే తన గెలుపు సాధ్యమైందని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తన నివాసంలో మదనపల్లె మున్సిపాలిటీ, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని, వారు ఎప్పుడు ఏ పని కావాలని వచ్చినా ముందుండి చేయిస్తానని భరోసా ఇచ్చారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గం అక్రమాలు, అన్యాయానికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకూ తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమా వేశంలో మున్సిపాలిటీ, మండలానికి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో పారిశుధ్యం మెరుగు

కలకడ, జూలై 18:ప్రజల సహకారంతో పారిశుధ్యం మెరుగుపడుతుందని కలకడ పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని వడ్లవీధి, జీకే వీధిలోని డ్రైనేజి కాలువలోని పూడికను శుభ్రం చేయించారు. గ్రామస్థులు చెత్తచెదారాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టలను ఉపయోగించాలన్నారు. అలాగే మురుగునీటిని రోడ్లపైకి రానివ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## 'సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలి'

పెద్దతిప్పసముద్రం జూలై 18 : సంఘమిత్రపై తగు చర్యలు తీసుకోవాలని మండలంలోని బూచిపల్లె గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర పొదుపు సంఘానికి చెందిన సభ్యులు పేర్కొన్నారు. గురువారం సంఘ సభ్యులు మండల కేంద్రమైన పీటీఎంలోని వెలుగు కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా సంఘమునకు సంఘమిత్రగా ఉన్న రెడ్డెప్ప మా గ్రూపు పేరుతో బి.కొతకోటలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మా గ్రామానికే చెందిన వేరొక గ్రూపును ఏర్పాటు చేసి రూ. 10 లక్షల రుణాన్ని వారికి మంజూరు చేయించారన్నారు. దీంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా డబ్బులు మా ఖాతాకు రూ.1,35000 రాగా బ్యాంకు వారు జమ చేసుకున్నారన్నారు. రెండవ విడతగా ఆసరా డబ్బులు రూ 93 వేలు రుణానికి జమ చేసుకున్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సంఘమిత్రపై విచారణ జరిపితే అతని అవినీతి బయటు పడుతుందని సంఘ సభ్యులు కోరుతున్నారు.

## తంబళ్లపల్లెలో జనసేన సభ్యత్వ నమోదు

తంబళ్లపల్లె, జూలై 18: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తంబళ్లపల్లెలో జనసేన నాయకులు ప్రారంభించారు. జనసేన తంబళ్లపల్లె మండల అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షుడు సురేష్‌ల ఆధ్వర్యంలో గురువారం తంబళ్లపల్లె, కురవపల్లె, పెండేరివారిపల్లె, పంచాలమర్రిలలో పలువురి చేత జనసేన పార్టీ సభ్యత్వం నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షల బీమా సభ్యత్వంతో పాటు కుటుంబసభ్యులకు బీమా రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు రాజారెడ్డి, నరేంద్రరెడ్డి, ఎద్దుల సురేంద్ర, వార్డు మెంబరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సుల జీతాల బిల్లులకు లంచం అడుగుతున్నారా..?

● ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విస్మయం...!



సర్వజన బోధనాస్పత్రిలో విచారిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 18: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పనిచేస్తున్న నర్సులు, వైద్య సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాల బిల్లుల కోసం ఓ అధికారి లంచం అడుతున్నారని, ఎమ్మెల్యేకు ఫిర్యాదు రావడంతో ఆయన విస్మయం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆ విషయమై ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి విచారించారు. గురువారం సర్వజన బోధానస్పత్రికి వచ్చిన ఎమ్మెల్యే అక్కడ అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) ధాత్రీశ్వరిదేవి ఎటువంటి సెలవుచీటి లేకుండా విధులకు గైర్హాజరవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను వైద్యవిధానపరిషత్‌కు సరెండర్ చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో 60 మంది దాకా ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌వోలు, వైద్య సిబ్బంది పనిచేస్తుండగా వారికి ఐదు నెలలుగా జీతాలు రాలేదు. ఈ క్రమంలో వారందరికి జీతాలు బిల్లులు పెట్టాలంటే ఒక్కొక్కరు రూ.2వేలు లంచం ఇవ్వాలని, ఆ సొమ్ములు ట్రెజరీవారికి చెల్లించాలని ఓ వ్యక్తి డబ్బులు డిమాండ్ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై విచారించి లంచం అడింగింది నిజమైతే అలాంటి అధికారిని వెంటనే సస్పెండ్‌కు సిఫారసు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజుకు సూచించారు. మెడికల్ కాలేజీకి సంబంధించి సీనియర్ డాక్టర్లు ఉన్నారని, వారందరిని ఆస్పత్రిలోని పలు విభాగాల్లో విధులు కేటాయిస్తే రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చని ప్రిన్సిపాల్‌కు సూచించారు. దీంతో పాటు అవుట్‌పేషెంట్ విభాగంలో మహిళ రోగులను పరీక్షించేందుకు సాధ్యమైనంత వరకు మహిళా డాక్టర్లను కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని కళాశాలలపై చర్య తీసుకోండి



ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్‌తో టీఎన్ఎస్ఎఫ్ నేతలు

మదనపల్లె టౌన్, జూలై 18: రాష్ట్రంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్‌కు విన్నవించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సౌరభ్‌గౌర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు పాటించాల్సిన విధివిధానలపై యజమాన్యాలను తగిన సూచనలివ్వాలని కోరారు. కొన్ని కళాశాలలు పేరుకు మాత్రమే డిగ్రీ కళాశాల బోర్డులు పెట్టి పాఠ్యాంశాలు, బోధనలు చేయకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ ఎస్ఎఫ్ నాయకులు సుబ్రమణ్యం రాజు, రాజేష్, నాగరాజు, జ్ఞానదీప్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలి



రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలో పాల్గొన్న జడ్జి, న్యాయవాదులు

వాల్మీకిపురం, జూలై 18: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గురు అరవింద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి గురు అరవింద్ మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరవచ్చన్నారు. అనంతరం స్థానిక కోర్టు వద్ద నుంచి ప్లకార్డులు చేత పట్టి బస్టాండ్ ప్రాంగణం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణమూర్తి, న్యాయవాదులు పీజీ విభాకర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, రవిప్రకాష్, వెంకటరెడ్డి, రెడ్డిసాయిగీత, మూర్తయ్య, పోలీసులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణతో ప్రమాద తీవ్రత తగ్గించవచ్చు



పీలేరులో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, న్యాయవాదులు

పీలేరు, జూలై 18: ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయాల్లో తీవ్రత తగ్గించవచ్చని పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు గురువారం న్యాయశాఖ, పోలీసు, రవాణా శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసినా ఎక్కువ మంది వాహనదారులు వాటిని ధరించడం లేదన్నారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్ నుంచి కోర్టు మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, న్యాయవాదులు సీవీ రెడ్డి, ఎల్లయ్య, నాగరాజ, చాన్ బాషా, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది వేణు, పృధ్వీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ విజయసాయిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పీలేరు, జూలై 18: మీడియా సంస్థలు, జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ విజయసాయిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీలేరులోని పాత్రికేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పీలేరులోని పాత్రికేయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల జాకీర్, చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు అధికార మదంతో కూడుకున్నవిలా ఉన్నాయని, భవిష్యత్తులో ఇంకెవ్వరూ అటువంటి వ్యాఖ్యలు చేయకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డీటీ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ కాన్సెప్ట్‌ను అమలు చేయండి

పీలేరు, జూలై 18: ప్రకృతి వ్యవసాయం పట్ల చిన్నతనం నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ కాన్సెప్ట్‌ను అమలు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోడేషా వలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన రాయచోటిలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. రసాయనిక సేద్యం స్థానంలో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూసారం, పంట దిగుబడి, ఆదాయం పెంచుకోవచ్చని ఆయన తెలిపారు. అంతే కాకుండా విద్యార్థులు వ్యవసాయాన్ని ఒక లాభదాయక వృత్తిగా కూడా మలుచుకోవచ్చనే అంశాన్ని తెలియజేసినట్లు ఉంటుందని పేర్కొన్నారు.

## పరిశుభ్రతతోనే డయేరియా నిర్మూలన సాధ్యం



డయేరియా నిర్మూలకు ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

నిమ్మనపల్లి, జూలై 18: పరిసరాల పరిశుభ్రతతోపా టు వ్యక్తిగత శుభ్రతతో డయేరియా, డెంగ్యూ, వ్యాధులను నిర్మూలించవచ్చని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అగ్రహారం పంచాయతిలో ప్రజలకు డయేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహంచారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి సోమ, గురు వారాలలో స్థానిక ఆరోగ్య కేంద్రంలో అన్ని టీకాలు వేస్తారన్నారు. ముఖ్యంగా దోమ కాటు వలన డెంగ్యూ వ్యాధి. నీటి కలుషితం వల్ల డయేరియా వస్తుంద న్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రషి, టీబీ పర్యవేక్షకుడు నాగిరెడ్డి ఏఎన్ఎంలు ,ఆశాలు పాల్గొన్నారు.

## వైసీపీకి 'పసుపు' దంపతుల రాజీనామా

మదనపల్లె, జూలై 18: మదనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు పసుపుపొడి రవీంద్ర దంపతులు ఆపార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక కమ్మగడ్డవీధి ఎక్స్‌టెన్షన్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బేసిక్‌గా ఈ కుటుంబం మూడుదశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతోంది. ఇందులోభాగంగా పసుపుపొడి రవీంద్ర..టౌన్‌బ్యాంకు డైరెక్టర్‌గా, మాజీ వైఎస్‌చైర్మన్‌గా పాతికేళ్లపాటు, ఆయన భార్య సుజాత..మూడు సార్లు కౌన్సిలర్లుగా పనిచేశారు. అయితే మూడున్నరేళ్ల క్రితం పసుపు కుటుంబం వైసీపీలో చేరింది. ఈ క్రమంలో మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో సూరే సుజాత వైసీపీ నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓటమి చెందారు. .తాజా పరిణామాల నేపథ్యంలో వారిద్దరూ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. పార్టీలో సముచిత స్థానం దక్కకపోవడంతో వారు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఇంతకాలం తమకు సహకరించిన కార్యకర్తలు, ఆర్యవైశ్యసోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.